

ఆదివారం ఉష్ణోగ్రత

	కనిష్టం	గరిష్టం
ఖమ్మం	34	23
భద్రాద్రి కొత్తగూడెం	36	25



ఆఇంటి నెంబరుకు సంబంధించి అసెస్‌మెంట్ డీయాక్టివేట్ చేసినట్టు చూపుతున్న రికార్డు



ఓ ఇంటి నెంబరుకు సంబంధించిన అసెస్‌మెంట్ కాపీ

ఆంధ్రజ్యోతి నిఘా

అసైన్డ్ భూములకు ఎసరు!

> ఖమ్మం నగరానికి నలుమూలల భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఎక్కడ చూసినా గజం రూ.10వేలకు తగ్గకుండా ఉంది. కొద్దిపాటి ఇంటి కోసం స్థలాన్ని కొనుగోలు చేయాలంటేనే రూ.లక్షలు వెచ్చించాల్సి వస్తోంది. దాంతో కొందరు పెద్దల కన్ను పేదల భూములపై పడింది. సాధారణంగా ప్రైవేటు భూములైతే రూ.కోట్లలో పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. దాంతో పేదలకు పంచిన అసైన్డ్ భూములపై కన్నేసిన కొందరు వ్యక్తులు తక్కువ ధరకు ఆయా భూములను కొనుగోలు చేసి దర్జాగా పేరు మార్చుకుంటున్నారు. దానికి ఖమ్మం కార్పొరేషన్‌లో కొందరు అధికారులు అందినకాడికి దండుకుని అసైన్డ్ భూములకు హక్కులు కల్పించేలా అక్రమార్కులకు వంతుపాడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా ఇటీవల ఖమ్మం కార్పొరేషన్‌లో 59 జీవోను అడ్డంపెట్టుకొని సాగిన భూఅక్రమాలపై పెద్ద దుమారం రేగగా.. తాజాగా ఖమ్మం అర్బన్ పరిధిలోని అసైన్డ్‌మెంట్ భూములకు సైతం ఇంటి నెంబర్లు కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. - ఆంధ్రజ్యోతి, ఖమ్మం

- దొంగ అసెస్‌మెంట్లతో దర్జాగా అక్రమాలు
- ఇంటి నెంబర్లతో హక్కులు పొందుతున్న ఇతరులు
- అందినకాడికి దండుకుని స్థలాలు కట్టబెట్టిన అధికారులు
- ప్రధాన రహదారుల వెంట కమర్షియల్‌గా వినియోగిస్తోన్న వైనం
- దందాలో ఓ బీఆర్ఎస్ మాజీ జడ్పీటీసీ, ఆయన అనుచరులు ?

ఖమ్మం అర్బన్ పరిధిలోని బల్లేపల్లి రెవెన్యూలో 137సర్వే నెంబర్‌లో 62.27 ఎకరాలు, 138 సర్వే నెంబరులో 94.38 ఎకరాల భూమి ఉంది. కొన్నేళ్ల క్రితం ఆయా భూములను పదుల సంఖ్యలో పేదలకు అసైన్‌మెంట్ చేసి కేటాయించారు. అయితే ఈ అసైన్డ్ భూములను ఇతరులకు బదలాయించడం కుదరదు. దాంతో కొందరు అక్రమార్కులు అసలు భూమి ఉన్న వ్యక్తుల పేర్లు కాకుండా వేరొకరి పేరు మీద దొంగ అసెస్‌మెంట్లు చేయించుకున్నారు. వాస్తవానికి ఏ స్థలానికైనా ఇంటి నెంబర్ కేటాయించాలంటే ఆయా భూములకు కన్వర్షన్ తప్పనిసరిగా ఉండాలి. కానీ అలాంటివేమీ లేకుండానే కార్పొరేషన్ అధికారులు అందినకాడికి దండుకుని దొంగ అసెస్‌మెంట్లు వేయగా.. కొందరు అక్రమార్కులు ఆయా అసెస్‌మెంట్లలోని ఇంటినెంబర్లతో దర్జాగా దందా చేస్తున్నారు. అసలు భూములు ఏవరి పేరుమీదున్నాయి. ఏ సర్వే నెంబర్లలో ఉన్నాయనే విషయాలు పట్టించుకోకుండా తమకు రావాల్సిన వాటా ముడితే చాలన్నట్టుగా ఇంటి నెంబర్లు కేటాయించి అసైన్డ్ భూములకు ఇతరుల పేర్ల మీద హక్కులు కల్పిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా అసైన్డ్ భూములు ఉన్న ఆ రెండు సర్వే నెంబర్లు కూడా ఖమ్మం నగరానికి ఆనుకుని ఉండటంతో ఈ దందాకు తెరలేపిన అక్రమార్కులు వైఎస్ఆర్‌నగర్ నుంచి రఘునాథపాలెం వెళ్లే రహదారిలో బైపాస్‌కు ఆనుకుని, వేపకుంట్ల వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న భూముల్లో ఈ తరహా దందా సాగినట్టుగా తెలుస్తోంది. అంతేనా ఒకరిద్దరు ఆయా అసెస్‌మెంట్లలో ఉన్న ఇంటినెంబర్లను ఆధారంగా చేసుకుని పలు ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల్లో రుణాలు తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది.

ప్రధాన రహదారుల వెంబడి కమర్షియల్‌గా..

రూ.కోట్ల విలువ చేసే అసైన్డ్ భూములను అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న సదరు వ్యక్తులు ఆయా భూముల్లో పెద్దపెద్ద భవంతులు సైతం నిర్మిస్తున్నారు. ఎలాంటి ఇంటి అనుమతులు లేకుండా జీ ప్లస్ వన్ ఇంటి నిర్మాణాలు చేస్తున్నారు. అయినా కార్పొరేషన్ అధికారులు మాత్రం తమకేమీ సంబంధం లేనట్టుగా వ్యవహరించడం గమనార్హం. వేపకుంట్ల వెళ్లే మార్గంలో ఎకరానికి పైగా స్థలంలో ఓ ఇంటి నిర్మాణం చేపట్టడంతోపాటుగా, రఘునాథపాలెం బైపాస్‌లో అయితే ఏకంగా ఓ రెసిడెన్సీ పేరుతో మినీ ఫంక్షన్ హాల్, లాడ్జీలు కూడా నిర్మించడం గమనార్హం. అయితే అనుమతి పొంది నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టే వారిపై చర్యలు తీసుకునే అధికారులు అసలు ఎలాంటి అనుమతులు లేకుండా భారీస్థాయిలో భవంతులు నిర్మించేవారి గురించి ఎందుకు పట్టించుకోవట్లేదన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అయితే ఈ దందాలో గతం నుంచి పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓ మాజీ జడ్పీటీసీ, ఖమ్మం ఐడీఓసీకి సమీపంలో ఉన్న ఓ గ్రామానికి చెందిన వ్యక్తి ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్లు కూడా..

ఎవరికైనా విద్యుత్ మీటరు కోసం దరఖాస్తు చేసుకుంటే అన్ని రకాల డాక్యుమెంట్లను పరిశీలించే విద్యుత్‌శాఖ అధికారులను సైతం ఈ మాయగాళ్లు బురిడీ కొట్టించినట్టుగా తెలుస్తోంది. విద్యుత్ శాఖ వారు మీటర్ ఇచ్చేందుకు ప్రామాణికంగా ఇంటి నెంబర్ పత్రాలనే పరిశీలిస్తారు. కాగా ప్రస్తుతం అసైన్డ్ భూములకు దొంగ అసెస్‌మెంట్లతో కార్పొరేషన్ అధికారులు ఇంటినెంబర్లు కేటాయించడంతో వాటిని చూపించిన అక్రమార్కులు ఏకంగా వారికంటూ ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్లను కూడా వేయించుకున్నట్టు తెలుస్తోంది. కాగా ఇటీవల కాలంలో దొంగ అసెస్‌మెంట్లు వ్యవహారం బయటకు వచ్చిన తర్వాత ఉన్నతాధికారులకు తెలియకుండా వందలకొద్దీ అసెస్‌మెంట్లను డీయాక్టివేట్ చేసిన జాబితాలో ఓ రెండు ఇంటి నెంబర్లకు సంబంధించిన అసెస్‌మెంట్లు ఉండగా.. డీయాక్టివేట్ చేసినా మొదట అసెస్‌మెంట్ వేసిన పత్రాన్ని చూపుతూ వారి పనులు చక్కబెట్టుకుంటున్నట్టు తెలిసింది. అంతేకాకుండా ప్రస్తుతం బైపాస్‌లో కమర్షియల్‌గా వాడుతున్న నిర్మాణానికి సంబంధించి ఇప్పటికీ అసెస్‌మెంట్ కొనసాగడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గతంలో ఖమ్మం అర్బన్ పరిధిలో విక్రయాలు జరిగిన అసైన్డ్ భూములను వెనక్కి తీసుకున్నట్టుగానే ప్రస్తుతం బల్లేపల్లి రెవెన్యూ సర్వే నెంబర్లలో విక్రయాలు జరిగిన భూములను కూడా వెనక్కి తీసుకోవాలని, దొంగ ఇంటి నెంబర్లు కేటాయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కొత్తగూడెంలో సోలార్ విద్యుత్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

- సోలార్ విద్యుత్ ఉత్పత్తికి సహకారం అందిస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- సోలార్ విద్యుత్‌పై మరింత దృష్టి పెట్టాలి: మంత్రి తుమ్మల
- కొత్తగూడెంలో సింగరేణి సోలార్ విద్యుత్ ప్లాంట్ ప్రారంభం

సింగరేణికి సర్కార్ బాసట

కొత్తగూడెం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సిరులవేణి సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బాసటగా నిలుస్తుందని డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణిలో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్ర పరిధిలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రూ.56కోట్లతో నిర్మించిన 10.5 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఆదివారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికోసం నూతన పాలసీలు తీసుకొస్తామన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. సింగరేణి పరిధిలో ఉన్న ఖాళీ భూముల్లో సోలార్ పవర్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలన్నారు. అందుకోసం సింగరేణి యాజమాన్యం ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేవలం భద్రాద్రి, యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులు చేపట్టినా వాటినుంచి పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించలేకపోయారన్నారు. కొత్తగూడెంలో ప్రారంభించిన 10.5 మెగావాట్ల సోలార్ పవర్‌ప్లాంట్ తోనే అంతా అయిపోలేదన్నారు. సింగరేణిలోని అన్ని ఏరియాల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో సోలార్‌విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో శంకుస్థాపన చేసిన భద్రాద్రి థర్మల్ పవర్‌స్టేషన్ రాష్ట్రానికి గుదిబండగా మారిందన్నారు.

సోలార్ విద్యుత్‌పై మరింత దృష్టి సారించాలి: మంత్రి తుమ్మల

సింగరేణి సంస్థ సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై మరింత ఫోకస్ పెట్టాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. కొత్తగూడెంలో సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోదీ కూడా సోలార్ విద్యుత్ ఉత్పత్తి రంగాన్ని ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్నారని, ఈ క్రమంలోనే రాష్ట్రంలోనూ సాగుకు పనికిరాని ప్రభుత్వ భూములు, సింగరేణి భూముల్లో సోలార్ విద్యుత్ ప్రాజెక్టులను నెలకొల్పాలని సూచించారు. గిరిజన అటవీ ప్రాంతాల్లో ఉన్నవారికి ఇలాంటి సోలార్ విద్యుత్ వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సింగరేణి ఎండీ బలరాం, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆలా కొత్తగూడెం, పినపాక, ఇల్లెందు, వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మాలోత్ రాందాస్ నాయక్, మట్టా రాగమయి, జారె ఆదినారాయణ, కొత్తగూడెం జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, ఏడీసీ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ నాయకులు జెనక్ ప్రసాద్, సీఎంవోపీ అధ్యక్షుడు లక్ష్మీపతి, సింగరేణి డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.



ప్లాంటు ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల



టిఫిన్ బాగుంది!

- ఖమ్మంలోని ఓ 'చిరు' హోటల్‌లో మంత్రి తుమ్మల అల్పాహారం
- భవన నిర్మాణ మహిళా కార్మికులతో మాటా ముచ్చట

ఖమ్మం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతిప్రతినిధి): అభివృద్ధి పనులు, సమీక్షలు వంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో బిజీగా ఉండే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం ఉదయం ఖమ్మం నగరంలో పర్యటిస్తూ ఓ చిరు హోటల్ దగ్గర ఆగి అల్పాహారం రుచిచూశారు. నగరంలోని ఎన్నెస్పీ రోడ్డులోని ఓ చిన్న హోటల్‌కు సామాన్యుడిలా వెళ్లి అక్కడ చిరుధాన్యాలతో తయారుచేసే దోశ, చిరు ఇడ్లీ, వడలు రుచి చూశారు. తరువాత టిఫిన్ చాలా బాగుందని హోటల్ యజమానికి కితాబిచ్చారు. ఆ తరువాత కారులో వెళుతుండగా భవన నిర్మాణ పనులు చేస్తున్న మహిళా కార్మికులను చూసి వారితో ముచ్చటించారు. వారికి రోజువారీ లభిస్తున్న కూలి గురించి వాకబు చేశారు. ఉచిత బస్సు పథకం ఎలా ఉందని ప్రశ్నించగా చాలా బాగుందని సదరు మహిళా కూలీలు కితాబిచ్చారు.

వివరాలు 7లో...

డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లుకు ఘన నివాళి

- శ్రద్ధాంజలి ఘటించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల

ఆదివాసీల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి
- భద్రాద్రిలో విజయ్‌సంకల్ప యాత్ర ప్రారంభం



సభలో మాట్లాడుతున్న విష్ణుదేవ్‌సాయి

నగర పాలకంలో కీచక ఉద్యోగి

- మహిళా ఉద్యోగులకు అసభ్య వీడియోకాల్స్
- సహాయ కమిషనర్ దృష్టికి సమస్య
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు



జూలూరుపాడు మండలం అనంతారంలోని పొలాల్లో వలస కూలీల గుడారాలు

'వలస' ముసుగులో మావోయిస్టులు?

- జూలూరుపాడులో మిర్చి కోతలకు వచ్చిన వలస కూలీలు
- వారిలో దళసభ్యులు ఉన్నట్లు అనుమానాలు
- రెండు రోజుల క్రితం నలుగురుని అదుపులోకి తీసుకున్న ఛత్తీస్‌గఢ్ పోలీసులు
- వలస కూలీల కదలికలపై స్థానిక పోలీసుల నిఘా

జూలూరుపాడు, ఫిబ్రవరి 25: పొటచేత పట్టుకొని పొరుగు రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చిన వలస కూలీలతో కలిసి మావోయిస్టు దళసభ్యులు పని చేస్తున్నట్లు సమాచారం. ఛత్తీస్‌గఢ్ పోలీసులు రెండు రోజుల క్రితం జూలూరుపాడు మండలం అనంతారం గ్రామంలో మిర్చీ కోతలకు ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన కూలీల్లో నలుగుని దళసభ్యులనే అనుమానంతో అదుపులోకి తీసుకొని వెళ్లినట్లు తెలుస్తోంది. జూలూరుపాడు మండలానికి రెండు నెలల క్రితం వేర్వేరు రాష్ట్రాలనుంచి సుమారు 5వేల మంది కూలీలు వలస వచ్చారు.

గతంలోనూ పట్టుబడ్డ దళసభ్యులు..

గతంలో ఛత్తీస్‌గఢ్ నుంచి జూలూరుపాడు మండలానికి మిర్చీ కోతలకు వచ్చిన కూలీల్లో దళ సభ్యులు ఉన్నట్లు అక్కడి పోలీసులు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. రెండేళ్ల క్రితం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ వలస కూలీ జిలిటన్ స్టిక్స్‌తో చర్లలో పోలీసులకు పట్టుబడ్డాడు. గత ఏడాది పాపకొల్లు ప్రాంతంలోనూ వలస కూలీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాదికూడా ఛత్తీస్‌గఢ్ నుంచి కొందరు దళ సభ్యులు వలస కూలీల ముసుగులో భద్రాద్రి జిల్లాలో పని చేస్తున్నారని సమాచారం అందుకొని వారి సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా రెండు రోజుల క్రితం జూలూరుపాడు మండలం అనంతారం గ్రామానికి వచ్చి వారి కదలికలను గుర్తించారు. వలస కూలీలు పని చేస్తున్న ప్రాంతానికి వెళ్లి ఛత్తీస్‌గఢ్‌లోని బైలాడిల్లా సమీపంలోని గంపూర్‌కు చెందిన మడవి లచ్చూ, మడ్కం నందుతో పాటు, అనంతారం గ్రామంలో పని చేస్తున్న మరో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వెళ్ళినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. అనంతారంలో మావోయిస్టు దళ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న వార్త జిల్లా వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఈ ఘటనతో వలస కూలీలుగా వచ్చిన వారిని పోలీసులు, ప్రజలు అనుమానించాల్సి పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితి వలస కూలీలకు కూడా ఇబ్బందికరంగా మారింది.

వలస కూలీల స్థావరాల్లో తనిఖీలు

జూలూరుపాడు మండలంలోని గుండెపుడి, అనంతారం, గంగారంతండా తదితర గ్రామాల్లో స్థానిక పోలీసులు శనివారం వలస కూలీలు నివసించే ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిఘా పెంచారు. ఇతర రాష్ట్రాలనుంచి వచ్చిన కూలీల వివరాలను సేకరించారు. వారికి సంబంధించిన ఆధార్‌కార్డులను పరిశీలించి గ్రామాల వివరాలను నమోదు చేసుకున్నారు.

వలస కూలీలను అదుపులోకి తీసుకున్నట్లు తెలీదు

ఇంద్రసేనారెడ్డి, సీఐ జూలూరుపాడు

ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పోలీసులు జూలూరుపాడు మండలానికి వచ్చి ఇక్కడ పని చేస్తున్న వలస కూలీలను అదుపులోకి తీసుకున్నట్టు తమకు ఎలాంటి సమాచారం లేదు. మండలంలో మిర్చీ కోతల పనులు చేపట్టడానికి ఏ రాష్ట్రం నుంచి ఎంతమంది కూలీలు వచ్చారో తెలుసుకునేందుకే తమ సిబ్బంది గ్రామాలను సందర్శించి వివరాలను సేకరిస్తున్నారు.

తూకంలో మోసం

- అడ్డంగా దొరికిన మిర్చి వ్యాపారి
- ఓ వ్యక్తిని బంధించిన ఆదివాసీలు.. నలుగురు పరారీ



కాంటా మోసంలో దొరికిపోయిన వ్యక్తి



దుమ్ముగూడెం ఫిబ్రవరి 25: భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మ్డలం మారాయిగూడెంలో ఆదివారం మిర్చి పంట కొనుగోలుకు వచ్చి తప్పుడు తూకం వేస్తూ ఓ వ్యాపారి అడ్డంగా దొరికిపోయాడు. ఈ వ్యవహారంలో మరో నలుగురు పారిపోయారు. సోందె పశయ్య అనే ఆదివాసీ రైతు వద్ద మిర్చి తూకం వేస్తున్న సందర్భంలో ఎలక్ట్రానిక్ కాంటాను రిమోట్‌తో కంట్రోలు చేయడాన్ని గమనించిన ఆదివాసీ రైతులు వారిని పట్టుకునేందుకు యత్నించారు. ఐతే వారిలో ఒకడు మాత్రమే దొరకగా, మిగతా నలుగురు మిర్చి లోడును తరలించేందుకు తెచ్చిన టాటా ఏస్ వాహనంతో సహా అతివేగంగా పారిపోయారు. బాధిత ఆదివాసీ రైతులు బైక్‌పై వారిని వెంటబడినా దొరకుండా పారిపోయారు. పట్టుబడిన వ్యక్తి తనపేరు సత్యనారాయణ అని తాను ఖమ్మం జిల్లా తల్లాడ మండలం నర్సింగపేట వాసుడని రైతులకు తెలిపాడు. తాను కూలీ పనికి వచ్చానని, వ్యాపారం చేసే వారితో తనకేమీ సంబంధం లేదంటున్నాడు. ఐతే మోసం చేసి పారిపోయిన వారు వస్తేతప్ప పట్టుడిన వ్యక్తిని వదలబోమని అతడిని తాళ్లతో బంధించారు. సదరు వ్యాపారులు ఈనెల 24న లచ్చిగూడెం, మారాయిగూడెం ప్రాంతాల్లో పదిహేను క్వింటాళ్ల మిర్చిని కొనుగోలు చేశారు. ఇంకా పరిసర గ్రామాల్లో ఎక్కడైనా కొనుగోలు చేశారో లేదో తెలియాల్సి ఉంది. స్థానిక వ్యాపారుల ఇవ్వజూపిన ధరకు అదనంగా ఈ మోసగాళ్ల క్వింటాకు రూ18,500లు ధర పెట్టడంతో వీరికి మిర్చి పంటను విక్రయించేందుకు ఆదివాసీ రైతులు ప్రయత్నించి మోసపోయారు. పట్టుబడిన వ్యక్తిని విడిపించేందుకు పారిపోయిన వ్యాపారులు మారాయిగూడెం రావాల్సి ఉంది. ఐతే కొద్ది రోజుల క్రితమే సింగారంలో ఒక వ్యాపారి తప్పుడు కాంటా మోసంతో పట్టుబడి రూలక్ష జరిమానా చెల్లించి బైటపడ్డాడు. ఐతే మండలంలో ఇటువంటి మోసాలు గతంలో ఎన్నో జరిగినా ఎటువంటి పోలీసు కేసులు నమోదు కాకపోవడంతో మోసగాళ్లు ఎప్పటికప్పుడు బరితెగిస్తున్నారు. తాజా ఘటనపై కూడా ఎటువంటి కేసు నమోదుకాలేదు.

నీటిఎద్దడి నివారణకు కార్యాచరణ

● జిల్లాలో 20 మండలాల్లో 178 గ్రామాల్లో సమస్యలకు ఆస్కారం
● రూ.4.83 కోట్లతో ప్రణాళికలు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి25: వేసవి నేపథ్యంలో భూగర్భ జలాలు అడుగంటుతున్న దృష్ట్యా అన్ని పంచాయతీల్లో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా చేసేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలకు ప్రణాళికలను సిద్ధం చేస్తుంది. ఎక్కడా ఖాళీ బిందెలు పట్టుకుని రోడెక్కే పరిస్థితి ఉండొద్దని అధికారుల సూచనల నేపథ్యంలో అన్ని గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నారు. సమస్యలు గుర్తించి అక్కడికక్కడే సమస్యను పరిష్కరించేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. అంతే కాదు రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి కోటి రూపాయలు స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద తాగునీటి ఎద్దడి నివారణ కోసం నిధులు మంజూరు చేయడంతో సమస్యలను గుర్తించే పనిలో ఉన్నారు. ఖమ్మం జిల్లాలోని 20 మండలాల్లో 178 గ్రామాలు సమస్యాత్మక గ్రామాలుగా అధికారులు గుర్తించారు. అక్కడ ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసేందుకు రూ.4.80 కోట్ల నిధులు అవసరం పడతాయని ప్రాథమిక అంచనాకు వచ్చారు. బోర్లు, మోటార్ల పనితీరును అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అవసరం ఉన్నచోట బోర్లు, బావులను ఫ్లైరింగ్ తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

969 ఆవాస గ్రామాలకు మిషన్ భగీరథ నీరు

జిల్లాలో 589 గ్రామపంచాయతీల్లో 969 ఆవాస ప్రాంతాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. మొత్తం 2,92,642 గృహాలకు తాగునీటి కనెక్షన్లు ఇచ్చారు. జిల్లాలో మొత్తం 2378.895 కిలో మీటర్ల పైపులైన్ వేశారు. 1908.148 కిలోమీటర్ల పాత లైన్లకు అనుసంధానం చేశారు. మొత్తం 588 కొత్త ట్యాంకులు మంజూరు కాగా, పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. అయితే 1487 ట్యాంకులకు ప్రతి నిత్యం మిషన్‌భగీరథ నీళ్లు అందిస్తున్నారు. జిల్లాలో 11 గ్రామాల్లో సక్రమంగా తాను నీరు సరఫరా కావడం లేదని గుర్తించారు. దీనికి తోడు ఆయా గ్రామాల్లో భూగర్భ జలాలు రోజురోజుకు తగ్గిపోతుండడంతో బోర్లు బావులు ఎండిపోతున్నాయి. దీంతో 178 గ్రామాల్లో ఈ వేసవిలో మంచినీటి ఎద్దడి వచ్చే ఆస్కారం ఉందని అధికారులు అంచనాలు సిద్ధం చేశారు.

- పాలేరు నియోజకవర్గంలో కూసుమంచి మండలంలో 14 గ్రామాలు, తిరుమలాయపాలెం మండలంలో 17, నేలకొండపల్లి మండలంలో 5, ఖమ్మం రూరల్ మండలంలో 9 గ్రామాలు మొత్తంగా 45 గ్రామాల్లో కనీసం రూ.కోటి అవసరం ఉంటుందని అంచనాలు సిద్ధం చేశారు. ఖమ్మం నియోజకవర్గంలో రఘునాథపాలెం మండలంలో 25 గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నివారణ కోసం రూ.84 లక్షలతో అంచనాలు సిద్ధం చేశారు. వైరా నియోజకవర్గంలో వైరాలో 5, ఏన్కూరు మండలంలో 6, కొణిజర్ల మండలంలో 10, సింగరేణి మండలంలో 5 మండలాల్లో రూ.83 లక్షలతో, కామేపల్లి మండలంలోని 11 గ్రామాల్లో రూ.20 లక్షలతో అంచనాలు తయారు చేశారు. సత్తుపల్లి నియోజకవర్గంలో సత్తుపల్లిలో 7, పెనుబల్లిలో 10, తల్లాడలో 6, వేంసూరులో 6, కల్లూరులో 8 గ్రామాల్లో మంచినీటి సమస్య రాబోతోందని అంచనా వేశారు. వీటి కోసం రూ. కోటి రూపాయలు ప్రతిపాదించారు. మధిర నియోజకవర్గం లో మధిరలో 7, బోనకల్ 7, ఎర్రుపాలెం 7, ముదిగొండ 7, చింతకాని మండలంలో 6 గ్రామాల్లో మంచినీటి సమస్య నివారణ కోసం రూ. 96.30లక్షలతో అధికారులు అంచనాలు సిద్ధం చేశారు.


తాగునీటి బోర్లను పరిశీలిస్తున్న అధికారులు

గ్రామాల్లో సర్వే చేస్తున్నాం



మంచినీటి ట్యాంకులు ప్రధాన పైపులైన్ల పరిస్థితితో పాటు పంపులు, ఏలా పనిచేస్తున్నాయి, లీకేజీలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలు పరిశీలిస్తున్నాం. బోర్లు వాటి పరిస్థితి, వాటికి ట్యాంకులకు అనుసంధానంగా ఉన్న పైపు లైన్లు ఎలా ఉన్నాయి అనేది పరిశీలిస్తున్నాం. అవసరమైన ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డీఎఫ్)తో అంచనాలు సిద్ధం చేస్తున్నాం. గ్రామాల్లో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

● పుష్పలత, ఈఈ మిషన్‌భగీరథ

ఖమ్మంతో ఎన్నో ఏళ్ల అనుబంధం

● ఖమ్మం ఎంపీ టికెట్ నాకే ఇవ్వాలి
● టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కుసుమకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జెట్టి కుసుమకుమార్

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 25: ఖమ్మం జిల్లాతో నాకు ఎన్నో ఏళ్ల అనుబంధం ఉందని, కమ్మ సామాజిక వర్గానికి చెందిన తనకు ఖమ్మం ఎంపీ టికెట్ ఇవ్వాలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జెట్టి కుసుమకుమార్ కోరారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘం నాయకుడిగా, అనేక ఎన్నికల్లో ఖమ్మం జిల్లా ఇన్‌చార్జిగా పనిచేశానన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్తే 'మీ ఖమ్మం ఏలా ఉంది' అని నన్ను అడుగుతారని పేర్కొన్నారు. 2014 ఎన్నికలు, పాలేరు ఉప ఎన్నికలు ఇలా అనేక ఎన్నికల్లో తాను ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ విజయంలో పాత్ర పోషించానన్నారు. జాతీయస్థాయి నాయకులు కూడా తనను ఖమ్మం నాయకుడిగా గుర్తిస్తారని వివరించారు. జిల్లాలోని కాంగ్రెస్ అన్ని అనుబంధ సంఘాలతో తనకు అనుబంధం ఉందన్నారు. సినియారిటీ ప్రకారం చూసినా తనకు టిక్కెట్ కేటాయించే అవకాశం ఉండటంతో ఖమ్మం ఎంపీ టికెట్ కోసం టీపీసీసీలో దరఖాస్తు చేశానన్నారు. చైతన్యవంతమైన ఖమ్మం ఓటర్లు ఇతర ప్రాంతాల నాయకులను ఎంపీగా గెలిపించిన చరిత్ర ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికకు తేడా ఉందన్నారు. ఎంపీ ఎన్నికల్లో సీనియారిటీకే ప్రాధన్యం ఇస్తారన్నారు. సమావేశంలో ఖమ్మం ఏ-బ్లాక్ అధ్యక్షుడు యర్రం బాలగంగాధర్‌తిలక్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ముగిసిన త్రిశూల్ దీక్ష


దుర్గామాత వేషధారణలో చిన్నారి

ఖమ్మంకార్పొరేషన్, ఫిబ్రవరి 25: విశ్వహిందూ పరిషత్-బజరంగదళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల త్రిశూల్‌దీక్ష ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా నగరంలోని సీక్వెల్ ఫంక్షన్‌హల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 600 మంది మహిళలు పాల్గొన్నారు. త్రిశూల్‌దీక్ష ముగింపు సందర్భంగా దుర్గామాత వేషధారణలో చిన్నారులు నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. విశ్వహిందూ పరిషత్- బజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు బోనాల రామకృష్ణ, కార్యదర్శి బొడ్డు కృష్ణలు మాట్లాడుతూ ధర్మస్థాపన కోసమే త్రిశూల దీక్ష చేపట్టామన్నారు. శ్రీరాముడి చేతిలో ధనస్సు కృష్ణుడి చేతిలో చక్రంలాగానే ప్రతి బజరంగ్‌దళ్ కార్యకర్త చేతిలో త్రిశూలం ఉండాలన్నారు. ధర్మాన్ని రక్షించటం కోసం ఆయుధం తప్పనిసరిగా వాడాలన్నారు. మూగజీవులను హింసించటం, హతమార్చటం, దేవాలయ భూములను ఆక్రమించడం, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించటం వంటివాటని సహించవద్దని, వారికి వ్యతిరేకంగా పోరాడదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్య నిర్వహణ అధ్య క్షుడు నేరెళ్ల శ్రీనివాస్, బాలాజీ, ఖమ్మం విభాగం మహిళా కార్యదర్శి నాగమణి, హైమావతి, భవ్య, స్వప్న, ఉమ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

11మంది పేకాటరాయుళ్ల అరెస్టు

వైరా, ఫిబ్రవరి 25: వైరా మునిసిపాలిటీ పరిధిలోని 13వ వార్డు గాంధీనగర్ సమీపంలో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. 11 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.57వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరందరిని పోలీస్‌స్టేషన్‌కు తరలిం చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాళం పగలగొట్టి ఇంట్లో చోరీ

ఇల్లెందుటౌన్, ఫిబ్రవరి 25: ఇంటి తాళం పగులగొట్టి చోరీ చేసిన సంఘటన 21ఫిట్ ఏరియాలోని తిలక్‌నగర్‌లో వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తిలక్‌నగర్‌కు చెందిన సింగరేణి కార్మికుడు బోయిన రవి మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి మేడారం జాతరకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. జాతర నుంచి ఆదివారం వచ్చిన రవి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడం గమనించాడు. బీరువాలో ఉన్న 15 గ్రాముల బంగారం, 50తులాల వెండి, రూ.50వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు చోరీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తూటికుంట్ల రామాలయంలో...

బోనకల్, ఫిబ్రవరి 25: మండల పరిధిలోని తూటికుంట్ల గ్రామంలోని రామాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు హుండీని ధ్వంసం చేసి నగదును చోరీ చేశారు. నెల రోజులు భక్తులు వేసిన కానుకలను లెక్కించకపోవడంతో దొంగలు హుండీను పగలగొట్టి కొంత నగదును అపహరించారు. సంఘటనపై గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వైరా, ఫిబ్రవరి 25: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన వైరా మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తల్లాడకు చెందిన గోవర్ధన్(21) అదే గ్రామంలో కొరియార్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. అంతే కాక ఖమ్మంలో డిగ్రీ చదువుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి వైరా వైరా మండల పరిధిలోని స్టేజి పినపాక-హై లెవెల్ వంతెన మధ్య జాతీయ ప్రధాన రహదారిపై ఆయన ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వైరా పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

మిర్చి కూలీల వాహనం, లారీ ఢీ: పలువురికి గాయాలు


108 వాహనంలో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

కొణిజర్ల ,ఫిబ్రవరి25: మిరపకాయ కోతకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్న కూలీల వాహనాన్ని, ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టిన సంఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని పల్లిపాడు సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శంకర్‌రావు, స్థానికులు కథనం ప్రకారం నల్గొండ జిల్లా కేతుపల్లి మండలం కొత్తపేటకు చెందిన సుమారు 20 మంది కూలీలు ట్రాలీ వాహనంలో జూలూరుపాడు మండలంలో మిరపకాయ కోతకు వచ్చి తిరిగి సాయంత్రం ఇంటికి వెళ్తుండగా పల్లి పాడు సమీపంలోకి రాగానే ఎదరుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాలీలోనే ఉన్న కూలీల్లో సువార్త, విమలమ్మ, లాజరు, కమల మ్మ, డ్రైవర్ కామేష్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 ద్వారా ఖమ్మం తరలించారు. పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోనకల్ మండలంలో అభివృద్ధి పరుగులు

● పనుల నిర్వహణ వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశాలు


స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

బోనకల్, ఫిబ్రవరి 25: బోనకల్ మండలంలో వివిధ పనులకు శ్రీకారం చూడుతున్నారు డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్క. ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన రెండు నెలల వ్యవధిలోనే రూ.వందల కోట్ల నిధుల విడుదలతో పాటు ప్రజల చిరకాల వాంచగా ఉన్న పనులను పూర్తి చేయడానికి శ్రీకారం చుట్టారు. మధిర నియోజకవర్గంలో ప్రధానంగా బోనకల్ మండలం నాడు కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉండేది. మొదట స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా, ఆ తరువాత వరుసగా నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా భట్టీ విక్రమార్క ఉండటంతో చేయాల్సిన పనులపై పూర్తి అవగాహన ఉంది. ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా వంద కోట్ల నిధులతో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ గురుకులాల సముదాయానికి సంబంధించి బోనకల్ మండలం లక్ష్మీపురం గ్రామంలో ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు పరిశీలిం చారు. సర్వే నెంబర్ 401లో 20 ఎకరాల భూమి అన్ని విధాలుగా అనువుగా ఉంటుందని ప్రతిపాదనలు పంపారు. బోనకల్‌తో పాటు మధిర, చింతకాని మండలాల్లో కూడ భూముల ప్రతిపాదనలను పంపించారు. నియోజకవర్గం నడుమ ఉన్న బోనకల్ మండలంలో ఇంటిగ్రేటెడ్ గురుకులాలను ఏర్పాటు చేస్తే అన్ని విధాలుగా బాగుంటుందన్న అభిప్రాయాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బోనకల్‌లో 71 సర్వే నంబర్‌లో గల 9 ఎకరాల భూమిలో ఇందిరా డెయిరీని ఏర్పాటు చేసేందుకు నాడు శంకుస్థాపన చేశారు. తిరిగి డిప్యూటీ సీఎం హోదాలో పనులు పూర్తి చేసేందుకు జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దేశంలోనే అతి పెద్ద డెయిరీగా మార్చి 61 వేల మంది మహిళలను వాటాదారులుగా చేర్చి లాభాలను పంచడ మే లక్ష్యంగా పనులను వేగవంతం చేస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ గురుకులాలు, ఇందిరా డెయిరీ పనులతో బోనకల్ మండలానికి భట్టీ మహర్దశ తీసుకు వస్తున్నారని ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. లింకు రోడ్లు, సీసీ రోడ్లు, పూర్తి చేయాల్సిన పనుల గురించి ఎప్పటికప్పుడు అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షా చేస్తున్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల విడుదల కూడ జాప్యం లేకుండా జరుగుతుండటంతో భట్టీ అభివృద్ధిలో తన మార్కును చూపించి నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా నిలుపుతారన్న భావన ప్రజల్లో వ్యక్తమవుతుంది.

అన్నదాతలపై కాల్పులు జరపడం అమానుషం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 25: పంటలకు కనీస మద్దతు కొరుతూ ఢిల్లీ సరిహద్దులో రైతులు నిరసన కార్యక్రమం చేస్తే అన్నదాతలపై కాల్పులు జరిపి ఓ రైతు ప్రాణం తీయడం అమానుషమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు విమర్శించారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంచికంటి భవన్‌లో ఆదివారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయటమే ఆయనకు ఇచ్చే నిజమైన భారతరత్న సార్ధకత అని పేర్కొన్నారు. ఢిల్లీలో రైతుల నిరసన కార్యక్రమానికి మద్దతు ప్రకటించారు. ధాన్యాలు, పప్పులు, నూనేలు, గింజలు, వాణిజ్య తదితర 23 రకాల పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని రైతులు న్యాయంగా డిమాండ్ చేస్తున్నారని ఢిల్లీ రైతుల నిరసన కార్యక్రమాన్ని వివరించారు. నీతి ఆయోగ్ కమిటీలో సభ్యులుగా ఉన్న స్వామినాథన్ సిఫార్స్‌లు అమలు చేయకుండా, ఆయన మరణానంతరం రాజకీయ ప్రయోజనాల కోసం భారతరత్న అవార్డును ప్రకటించి రైతులను మభ్య పెట్టేందుకు బీజేపీ ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. వాస్తవ వ్యవసాయ ధరలకు పెట్టుబడి, కౌలు, ప్రకృతి వైపరీత్యాలు, విప త్తులను లెక్కించి వాటికి 50శాతం అదనంగా ఎంఎస్పీ మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించేందుకు ఢిల్లీలో రైతులు నిరసన కార్యక్రమం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో పొన్నం వెంకటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, బండి రమేశ్, విక్రమ్, రమేష్, రాంబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

రామాయణం గ్లోబల్ కాంటెస్ట్‌లో మధిర వాసికి ప్రతిభ


చిన్న జీయర్‌స్వామి చేతుల మీదుగా చెక్కు అందుకుంటున్న పృద్వీకృష్ణ

మధిర, ఫిబ్రవరి 25: హైదరాబాద్‌లోని శ్రీరామానుజ చిన్న జీయర్‌స్వామి ట్రస్టు ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా ఆరు నెలలుగా నిర్వహిస్తున్న గ్లోబల్ రామాయణం ఆన్‌లైన్ టెస్ట్‌లో మధిర వాసి అయిన మేళ్లచెర్వు పృద్వీకృష్ణ ప్రతిభ చూపారు. శనివారం ట్రస్టు సభ్యులు ప్రకటించిన ఫలితాల్లో పృద్వీకృష్ణ ప్రథమ బహుమతి సాధించి చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా రూ.లక్ష అవార్డును అందుకున్నారు. పృధ్వీ బీటెక్ చదివి, ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. అతని కుటుంబం వైష్ణవ మతం కావడంతో ఆధ్యా త్మిక కార్యక్రమాల్లో మక్కువ పెంచుకున్నాడు. అతనితో పాటు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మరో ముగ్గురిని ఎంపిక చేశారు. ఈ అవార్డు దక్కించుకున్న పృద్వీకృష్ణను తల్లిదండ్రులు మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు, రాధా, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వేణుగోపాలరావు, పలువురు పట్టణ ప్రముఖులు తదితరులు అభినందించారు.

కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్


సమావేశంలో మాట్లాడుతున్న మహేష్

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్ర వరి 25: కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయడం ద్వారానే ప్రభుత్వ విద్యారంగం ప్రాణం పోసుకుంటుందని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ అన్నారు. ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రభుత్వ విద్యారంగం ఎదుర్కొంటున్న సవాల్‌పై చర్చించారు. ప్రజల ఆకాంక్షల మేరకు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగం బలోపేతంపై స్పష్టమైన, నిర్దిష్టమైన ప్రణాళిక ఇవ్వాలని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ విద్యారంగం కుదేలైందన్నారు. ఖమ్మం జిల్లాకు ప్రభుత్వ యూనివర్శిటీ కేటాయించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి మస్తాన్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఉమాశంకర్, నాగరాజ్, సాగర్, రాకేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజయడెయిరీని కాపాడాలని మంత్రికి వినతి

ఖమ్మం కార్పొరేషన్, ఫిబ్రవరి 25: ఖమ్మంలోని విజయడెయిరీలో అవినీతి జరుగుతున్నదని, రెగ్యులర్ డిప్యూటీ డైరెక్టర్‌ను నియమించి డెయిరీని కాపాడాలని కొందరు పాడి రైతులు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శనివారం రాత్రి కలిసి వినతిపత్రం అందజేశారు. డెయిరీకి రైతులు పోసే పాలల్లో వెన్నశాతాన్ని తగ్గించి చూపుతూ అవినీతికి పాల్పడుతున్నారని, డిప్యుటేషన్‌పై డీడీని నియమించడం వల్ల నామమాత్రపు చర్యలు ఉంటు న్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. డెయిరీ మేనేజర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే డీడీ అతడిని వేరే విభాగానికి బదిలీచేసి, నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని ఉద్యోగిని మేనేజర్‌గా నియమించారని పాడిరైతులు మంత్రికి వివరించారు. జరుగుతున్న అవినీతిపై ప్రశ్నిస్తే తమను బెదిరిస్తున్నారని, పాడిరైతులను ఆర్థికంగా దోచుకుంటున్న వారిపై చర్యలు తీసుకొని, రెగ్యులర్ అధికారులను నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ పాడిరైతుల సమస్యలను తెలుసుకునేందుకు త్వరలో వారితో సమావేశం నిర్వహిస్తామని పాడి రైతులకు హామీ ఇచ్చారు. అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెగ్యులర్ డీడీ నియామకంపై డెయిరీ ఉన్నతాధికారులతో మాట్లాడతానని పేర్కొన్నారు.

తీరనున్న పాఠకుల కష్టాలు

● జిల్లా గ్రంథాలయానికి సరికొత్త భవనం
● రూ. 2.6 కోట్ల నిధులకు ప్రతిపాదనలు
● హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు


పాత గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం ఖానాపురం హవేలీ, ఫిబ్రవరి 25: వేలాది మంది పాఠకులకు, పోటీ పరీక్షల అభ్యర్థులకు అనుకూలంగా ఉండే విధంగా ఖమ్మం జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయానికి త్వరలోనే ఆధునిక వసతులతో ఉన్న పక్కా భవనం అందుబాటులోకి రానుంది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు ప్రత్యేక శ్రద్ధతో ఈ భవన నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. జనవరి 12న గ్రంథాలయ సముదాయంలోని ఓ భాగం శిథిలావస్థకు చేరి కూలిన విషయం తెలిసిందే. దీంతో వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల మొత్తం గ్రంథాలయ భవనాలను తొలగించి వాటి స్థానంలో సరికొత్తగా పాఠకులకు అందుబాటులోకి పక్కా వసతులతో కూడిన భవనాన్ని నిర్మించాలని అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా ఇటీవల గ్రంథాలయ నూతన నిర్మాణ ప్రాంతాన్ని మంత్రి సం దర్శించి పలు సూచనలు చేశారు. భవన నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించి పాఠకులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికా రులకు మంత్రి సూచించారు.

● మంత్రి తుమ్మల చొరవతో సాకారం

ఖమ్మం నగరంతో పాటు ఇతర మండలాల నుంచి నిత్యం గ్రంథాలయానికి వచ్చి చదువుకునే విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాత భవనం స్థానంలో విశాలమైన రీడింగ్ రూమ్‌లతో కూడిన పక్కా భవనాన్ని నిర్మించాలని సూచించారు. ఈమేరకు జిల్లా కేంద్ర గ్రంథాలయ అధికారులు రూ.2.6 కోట్లతో ప్రతిపాదనలకు రూపొందించారు. అనుమతుల కోసం జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించారు. నేడో రేపో ఆ ప్రతిపాదనలకు ఆమోదం లభించి నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభం అవుతాయి. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే టెండర్ ప్రక్రియను ముగించి వందేళ్లకుపైగా సేవలందించే భవనాన్ని నిర్మించనున్నారు.

● జీ+1 భవన సముదాయం...

త్వరలో నిర్మించబోయే గ్రంథాలయాన్ని జీ+1గా ప్లానింగ్ చేస్తున్నారని గ్రాంథాలయ సిబ్బంది చర్చిం చుకుంటున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రోజువారి పత్రికల పఠనం కోసం వచ్చే వారికి ఏర్పాట్లు చేయనున్నారు. దానితో పాటు కార్యాలయ సిబ్బంది గదులు ఉండను న్నాయి. తొలి అంతస్తులో విలువైన గ్రంథాలు, అరుదైన పుస్తకాలతో పాటు వివిధ భాషలకు చెందిన కవులు, రచయితల పుస్తకాలు భద్రపర్చనున్నారు.

అన్ని రకాల పాఠకులకు అనువుగా ఉండేలా పఠనాలయాన్ని తీర్చిదిద్దనున్నారు. గ్రంథా లయానికి నూతనం భవనం నిర్మిస్తుండడంతో పాఠకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంధకారంలో సత్తుపల్లి పట్టణ శివారు

● ఫ్లైఓవర్ బ్రిడ్జిపై లైట్లు అమర్చి రెండు నెలలు
● ఇంకా కనెక్షన్ ఇవ్వని మునిసిపల్ సిబ్బంది
● పట్టించుకోని అధికారులు


చీకటిమయంగా ఉన్న సత్తుపల్లి శివారు ఫ్లైఓవర్ బ్రిడ్జి

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి25: చారిత్రక నేపథ్యం కలిగిన సత్తుపల్లిలో సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే మాదిరిగా కనిపిస్తున్నాయి. సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారిపై కొన్నేళ్ల క్రితం నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జీపై రెండు నెలల క్రితం వరకు వీధిలైట్లు లేవు. అయితే మునిసిపల్ అధికారులు వాహనదారుల అభ్యర్థన మేరకు ఫ్లైఓవర్ బ్రిడ్జీపై రూ.లక్షలు వెచ్చించి వీధిలైట్లను అమర్చారు. కానీ ఆ బ్రిడ్జీ జాతీయ రహదారిపై ఉండటంతో అక్కడే మెలిక ఏర్పడింది. వీధిలైట్లు ఏర్పాటు చేసి రెండు నెలలు కావస్తున్నా సదరు ఎన్‌హెచ్ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదంటూ మునిసిపల్ అధికారులు చెబుతున్నారు. జాతీయ రహదారిపై రోడ్డును తవ్వి ఇంటర్నల్‌గా కనెక్షన్ ఇచ్చినట్లయితే బ్రిడ్జీపై వీధిలైట్లు వెలిగే అవకాశం ఉంది. అనుమతి కోసం నివేదించినప్పటికీ ఇప్పటి వరకు సదరు అధికారులు ఏమీ చెప్పకపోవడంతో వాహనదారులు చీకట్లో ప్రమాదాలకు గురవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పట్టణంలో ఎక్కడబడితే అక్కడ గోతులు...

సత్తుపల్లి మునిసిపాలిటీలో రెండు దశాబ్దాల నుంచి రహదారిపై గుంతలు వేధిస్తున్నాయి. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ప్రధాన రహదారితో పాటు అంతర్గత రహదారులలో తాగునీటి పైపులైన్ల కోసం తవ్వి సరిగా పూడ్చలేదని, దీంతో ప్రమాదాలు చాలావరకు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ తాగునీటి పైపు లైన్ల తవ్వకాలకు లెక్కేలేదు. అడ్డేలేదంటూ ప్రజలు వాపోతున్నారు. ఆ గుంతలలో పడి ఎందరో ప్రమాదాల బారీన పడిన సంఘటనలు అనేకం ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. కూడా. ఇక ఆ తర్వాతి వంతు జీయో, ఎయిర్‌టెల్ కంపనీల వంతు. ఫైబర్ నెట్‌వర్క్ పేరుతో రోడ్లన్నీ ధ్వంసం చేసేస్తున్నారని, వాహనాల రాకపోకలు కాదుకదా నడిచేందుకే వీలేలేకుండా పోతుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అయితే ఫైబర్ నెట్‌వర్క్ కోసం ఇచ్చే అనుమతులు ఫ్లైఓవర్ బ్రిడ్జీపై విద్యుత్ కనెక్షన్‌ను ఎందుకు ఇవ్వరంటూ వాహనదారులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా హిందూ స్మశాన వాటిక వద్ద నుంచి తమ్మిలేరు బ్రిడ్జీ మీదుగా తాళ్లమడ గ్రామం వరకు వీధిలైట్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇదేవిషయమై సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ మందా రవిబాబు వివరణ కోరగా తాను నూతనంగా విధులలో వచ్చానని, పూర్తి వివరాలు తెలుసుకుని వీధిలైట్లకు కనెక్షన్ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.


గుంతలమయంగా మారిన సత్తుపల్లి ప్రధాన రహదారి

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బూర్గంపాడు, ఫిబ్రవరి 25: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మండల పరిధిలోని బుడ్డగూడెం గ్రామ శివారులో రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. బుడ్డగూడెం గ్రామశివారులోని కిన్నెరసాని వాగు నుంచి శనివారం రాత్రి సమయంలో ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో ఆర్ఐ నరసింహరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు ట్రాక్టర్లను పట్టుకుని బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా అధికారుల సమాచారం తెలుసుకున్న ఎక్స్‌కవేటర్, నాలుగు ట్రాక్టర్లు పరారయినట్లు తెలుస్తోంది. పట్టుబడిన ట్రాక్టర్లు విడిచిపెట్టేందుకు అధికార పార్టీ నాయకులు అధికారులపై ఒత్తిడి చేసినట్లు సమాచారం. అనుమతులు లేకుండా అక్రమ ఇసుక, మట్టి తోలకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

అలంకార ప్రాయంగా

ఆయుష్ ఆరోగ్య స్వస్థత కేంద్రం

● ఐదు నెలలు కావస్తున్నా ప్రారంభానికి నోచుకోని వైనం


నిరుపయోగంగా ఉన్న ఆయుష్ ఆరోగ్య స్వస్థత కేంద్రం

కల్లూరు, ఫ్రిబ్రవరి 25 మండల పరిధిలోని చిన్నకోరుకొండి గ్రామంలో ఆయుష్ శాఖ తరుపున నిర్మించి ఆర్యోగ స్వస్థత కేంద్రం ప్రారంభానికి నోచుకోక అలంకార ప్రాయంగా మారింది. ఈ భవానాన్ని ఐదు నెలల క్రితం ఆయూష్ శాఖ తరుపున రూ.6.50 లక్షల అంచనాతో నిర్మించారు. కాని ఇందులో నేటి వరకు ఎలాంటి సేవ కార్యక్రమాలు చేపట్టకపోవడంతో ఇది నిరుపయోగం గా మారింది. చిన్నకోరుకొండిలో స్థానికంగా గల హోమియోపతి వైద్యశాలకు అనుబంధంగా గాంధీ విగ్రహం సమీపాన గల మూడు కుంటల స్థలంలో ఈ భవనాన్ని నిర్మించారు. ఆయుష్ శాఖ తరఫున ఆర్యోగ స్వస్థత వంటి కార్యక్రమాలను (యోగాశానాలు) చేసేందుకు ఈ భవనాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్థుల విజ్ఞాపనకు అనుసంధానంగా గ్రంథాలయ ఏర్పాటుకు కూడా జిల్లా కలెక్టర్ గౌతమ్ అనుమతించారు. కాని ఇక్కడ ఆర్యోగ స్వస్థత కేంద్రం ప్రారంభమైతే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ భవనం చుట్టూ పిచ్చిమొక్కలు వెలిసి దర్శన మిస్తున్నాయి. ఈ కేంద్రం నిర్వహణ పరంగా సేవ కార్యక్రమాలు కొనసాగేలా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే రాగమయి స్పందించి తగిన విధంగా కేంద్రం సేవలు అందుబాటులో వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆదివాసీల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- రామయ్య తల్లి కౌసల్య జన్మస్థానం ఛత్తీస్‌గఢ్ కావడం అదృష్టం
- గిరిజన రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయిస్తున్నది మా ప్రభుత్వమే
- ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయి
- భద్రాద్రిలో 'విజయ్‌సంకల్ప యాత్ర' ప్రారంభం

భద్రాచలం, ఫిబ్రవరి 25: ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా ఇలా అనేక గిరిజన రాష్ట్రాలలో కోట్ల మంది ఆదివాసీల అభివృద్ధికి బీజేపీ కృషి చేస్తుందని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయి తెలిపారు. రానున్నలోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని మూడు పార్లమెంట స్థానాల్లోని 22 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించే విజయసంకల్ప యాత్రను భద్రాచలంలో ఆదివారం ఆయన ప్రారంభించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ బీజేపీ ప్రవేశపెట్టిన ప్రతి పథకం కూడా గిరిజనులకు, ఆదివాసీలకు ఉపయోగపడుతుందని, 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు చేసిందేమీ లేదన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టే ప్రతి పథకం పేదవాడికి ఉపయోగకరంగా ఉండేలా పథకాల రూపకల్పన జరుగుతుందని, ఉజ్వల యోజన, ముద్రలోన్లు, ఇంటింటికి మరుగుదొడ్లు, జాతీయ రహదారుల అభివృద్ధి, సబ్సిడీ రుణాలు వంటి పథకాలు పేదలు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే అవినీతిమయమని, కాంగ్రెస్ పాలనలో అన్ని స్కాములు, అవినీతి కుంభకోణాలే వెలుగుచూశాయని, అందుకే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బీజేపీ పాలించిన 15 సంవత్సరాల కాలంలో లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.16 వేల కోట్లు అందించామన్నారు. కాని గత ఐదేళ్ల కాలం ఛత్తీస్‌గఢ్‌ను పాలించిన కాంగ్రెస్ రాష్ట్రాన్ని అన్ని రకాలుగా వెనక్కి తీసుకెళ్లారని పేర్కొన్నారు. పుణ్యక్షేత్రమైన భద్రాచలం నుంచి విజయసంకల్ప యాత్రను ప్రారంభించడం నా అదృష్టంగా భావిస్తున్నానని, ఈ యాత్రలో ప్రజలు అత్యధికంగా పాల్గొని బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని గిరిజన నియోజకవర్గమైన మహబూబాబాద్ పార్లమెంటు స్థానంలో బీజేపీ అభ్యర్థినే గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ విజయరామారావు, మాజీ ఎమ్మెల్యే విజయ సంకల్ప యాత్ర క్లస్టర్ ఇన్‌చార్జ్ ఎం ధర్మారావు, ఇరు జిల్లాల బీజేపీ అధ్యక్షులు రంగా కిరణ్, గల్లా సత్యనారాయణ, ఖమ్మం పార్లమెంటు ఇన్‌చార్జ్ రామలింగేశ్వరరావు, ఉదయ్ ప్రతాప్, తాండ్ర వినోద్‌రావు, శ్యామ్‌రాథోడ్, కుంజా ధర్మారావు పాల్గొన్నారు.


విజయసంకల్ప యాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు

భద్రాద్రిని మరో అయోధ్యను చేస్తాం

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

భద్రాచలాన్ని మరో అయోధ్యను చేసేందుకు బీజేపీ చిత్తశుద్ధితో ఉందని కామారెడ్డి ఎమ్మెల్యే కె. వెంకటరమణారెడ్డి అన్నారు. విజయ సంకల్ప యాత్ర బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ మాట తప్పని నాయకుడు ప్రధాని నరేంద్రమోదీ అని, అభివృద్ధి ఎక్కడ ఉంటే అక్కడ మోదీ ఉన్నట్లేనని, దేశాన్ని విశ్వగురూ స్థానంలో నిలబెట్టిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందని పేర్కొన్నారు.

రామయ్యను దర్శించుకున్న సీఎం విష్ణుదేవ్‌సాయి

భద్రాచలం పర్యటనకు వచ్చిన ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయి ఛత్తీస్‌గడ్ రాజధాని రాయ్‌పూర్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి బూర్గంపాడు మండలంలోని సారపాక బీపీఎల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అనంతరం జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన ప్రత్యేక కాన్వాయ్‌లోభద్రాచలం రామాలయంకు చేరుకున్నారు. ఈ సమయంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఆలయ వైదిక సిబ్బంది సీఎం విష్ణుదేవ్‌సాయికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వైదిక సిబ్బంది ఆయనకు వేద ఆశీర్వచనం అందజేయగా భద్రాద్రి దేవస్థానం తరపున శాలువ, జ్ఞాపిక, స్వామి వారి ప్రసాదంను దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి అందజేశారు.


భద్రాది రామాలయంలో ఛత్తీస్‌గఢ్ సీఎం

సారపాకలో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రికి ఘనస్వాగతం

బూర్గంపాడు, ఫిబ్రవరి 25: ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి భద్రాచలం పర్యటనలో భాగంగా ఆదివారం సారపాకలోని ఐటీసీ అనుబంధ భద్రాచలం పబ్లిక్‌స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు హెలికాప్టర్‌లో చేరుకున్నారు. ముఖ్యమంత్రికి ఎస్పీ రోహిత్‌రాజ్, బీజేపీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట్రామారెడ్డి, బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. మీడియా ప్రతినిధులను, పార్టీ నాయకులను హెలిప్యాడ్ వద్దకు అనుమతించకపోవడంతో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రాచలం పర్యటన అనంతరం సారపాకకు చేరకుని తిరుగు పయణమయ్యారు.

నగరపాలకసంస్థ కార్యాలయంలో కీచక ఉద్యోగి

- మహిళా ఉద్యోగులకు అసభ్య వీడియోకాల్స్
- సహాయ కమిషనర్ దృష్టికి సమస్య ▸ పోలీసులకు ఫిర్యాదు

ఖమ్మంకార్పొరేషన్, ఫిబ్రవరి 25: ఖమ్మం నగరపాలకసంస్థ ప్రజారోగ్య విభాగంలో పనిచేసే ఓ ఉద్యోగి పారిశుధ్య విభాగంలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ మహిళా ఉద్యోగులకు అర్ధరాత్రి అసభ్య వీడియో కాల్స్ చేస్తుండటంతో వారు తీవ్ర ఆవేదనకు గురువుతున్నారు. ఈ విషయమై నగరపాలకసంస్థ సహాయ కమిషనర్ సంపత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సదరు ఉద్యోగి గతం లో అధికారులకు అసభ్య మెసేజ్‌లు పెట్టడంతో అతడిపై చర్యలు తీసుకొని, ప్రస్తుతం కుక్కలను బంధించి కేంద్రానికి తరలించే విధులు అప్పగించారు. అయితే గత కొన్నిరోజులుగా ఔట్‌సోర్సింగ్ మహిళా ఉద్యోగులకు అర్ధరాత్రి వేళ నగ్నంగా ఉండి వీడియోకాల్స్ చేయటం, అసభ్యంగా మాట్లాడటంతో శనివారం సహాయకమిషనర్ దృష్టికి తెచ్చారు. సదరు ఉద్యోగి రెండురోజులుగా విధులకు రావటం లేదు. కాగా ఇదే విషయాన్ని మహిళా ఉద్యోగులు పోలీసులు దృష్టికి తీసుకువెళ్లారు.

ప్రశాంతంగా గురుకుల సీవోఈ అర్హత రెండో పరీక్ష

● పర్యవేక్షించిన ఆర్సీవో ప్రత్యూష

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 25: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకాల ఇంటర్‌లో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 28 సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ జూనియర్ ఇంటర్ విద్యార్థుల ఎంపికకు రెండో విడత అర్హత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఐదు ప్రవేశ పరీక్ష కేంద్రాల ద్వారా పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1794 మంది విద్యార్థులకు 1715 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనారు. పరీక్షా కేంద్రాలను ఆర్సీవో ప్రత్యూష పర్యవేక్షణ చేశారు.


పరీక్షలను పరిశీలిస్తున్న ఆర్సీవో ప్రత్యూష

వైద్య ఆరోగ్యశాఖలో
ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 25: కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న 73 పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ జెవిఎల్.శిరీష ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ రకాల ఒప్పంద, పొరుగు సేవల ప్రాతిపదిక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ లోపు తమ దరఖాస్తులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో అం దించాలని కోరారు. వివరాలకు kothagudem.telangana.gov.in సంప్రదించాలన్నారు.

సెమీస్ దశకు కేపీఎల్ క్రికెట్ పోటీలు


జేవీజీ చిటాస్, సీ-స్టార్ స్పార్టన్ జట్ల మధ్య మ్యాచ్

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 25: ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న ఖమ్మం ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) టీ-20 క్రికెట్ పోటీలు సెమీస్ దశకు చేరుకున్నాయి. టోర్నీలో మిఠాయి పొట్లాం, బాలాజీ బ్లాస్టర్స్ జట్లు పూల్ ఏ నుంచి సెమీస్‌కు చేరుకోగా ఆదివారం జరిగిన పూల్ బి లీగ్ పోటీలో జేవీజీ చిటాస్, సి-స్టార్ స్పార్టన్ జట్లు తలపడ్డాయి. మ్యాచ్‌లో మొదటగా బ్యాటింగ్ చేసిన జేవీజీ చిటాస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 234 పరుగులు చేయగా అనంతరం చేజింగ్‌కు దిగిన సీ-స్టార్ స్పార్టన్ జట్టు 87 పరుగులు చేసి ఆలౌట్ అయి పరాజయం పాలైంది. పోటీలను టోర్నీ ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, వేముల వెంకట్, బాణాల లక్ష్మణ్, మతిన్, నరాల నరేష్, శ్రీకాంత్, ఓలేటి సాంబమూర్తి సమీక్షించారు.

విద్యుత్ అధిక లోడుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు

● పరికలబోడు, బూడిదంపాడు, బావోజితండా, మల్లేపల్లిలో ఏర్పాటు

● పర్యవేక్షించిన డీఈ రామారావు

రఘునాథపాలెం, ఫిబ్రవరి 25: వేసవి కాలం దృష్ట్యా విద్యుత్ అధిక లోడుతో ట్రాన్స్ పార్మర్లు కాలి పోకుండా విద్యుత్‌శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం వరకు ముందస్తు విద్యుత్ కోతలను ప్రకటించిన అధికారులు ఆ మేరకు శాఖా పరంగా క్షేత్రస్థాయి ట్రాన్స్ ఫార్మర్ల మరమ్మతులు, విద్యుత్ ఉపకేంద్రాల నిర్వహణ కార్యక్రమాలు పూర్తి చేశారు. రఘునాథపాలెం మండలంలోని పరికలబోడుతండా, బూడిదంపాడు, బావోజితండా, మల్లేపల్లి గ్రామ పంచాయతీల్లో అదనంగా 25కేవీ విద్యుత్ సామర్థ్యం కలిగిన ఆరు నూతన ట్రాన్స్ ఫార్మర్ల ను అదనంగా ఏర్పాటు చేశారు. ఖమ్మం డీఈ నంబూరి రామారావు, ఏడీఈ మల్లారపు సంజీవ్‌కుమార్ పర్యవేక్షణ చేశారు. ఏఈ సతీష్ పాల్గొన్నారు.


పరికలబోడు తండాలో ఏర్పాటు చేసిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్

బెంగళూరులో మార్చి 5,6,7 తేదీల్లో
నేషనల్ హార్టికల్చర్ ఎగ్జిబిషన్

● ఖమ్మం జిల్లానుంచి 50మంది రైతులు

ఖమ్మం, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): బెంగళూరులోని హెసరగుట్టలో భారతీయ ఉద్యానవన పరిశోధన సంస్థ ఐసీఏఆర్‌ఏఐహెచ్‌ఆర్ ఆధ్వర్యంలో మార్చి 5,6,7 తేదీల్లో ఉద్యావన పరిశోధన సంస్థ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు. ఉద్యానవన తోటలు, పంటల సాగు, పరిశోధనలతో పాటు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక పద్ధతులు, ఆయాపండ్ల తోటల్లో కొత్తరకాలు తదితర అంశాలపై ఎగ్జిబిషన్‌లో పరిచయం చేయనున్నారు. హార్టికల్చర్‌లో సుస్థిర అభివృద్ధికి కొత్త తరహా సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యానవన పంటల సాగుపై ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఈప్రదర్శనకు జిల్లా నుంచి 50మంది రైతుల బృందం వెళ్లబోతుంది. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో జిల్లా హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ అనసూర్య, రైతుసంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు చర్చించారు జిల్లా నుంచి వెళ్లే రైతు బృందాన్ని ఎన్నిక చేయాలని మంత్రి తుమ్మల అధికారులకు సూచించారు.

రేపటినుంచి మారాయిగూడెం జాతర

- జాతరకు ముస్తాబైన సమ్మక్క-సారలమ్మ గద్దెలు

దుమ్ముగూడెం ఫిబ్రవరి 25:ఈనెల 27న ప్రారంభం కానున్న మండలంలోని మారాయిగూడెం సమ్మక్క-సారలమ్మ జాతరకు గద్దెలు ముస్తాబయ్యాయి. గద్దెల ప్రాంగణంలో చలువ పందిళ్ల వేశారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లులుగా వేలాది మంది భక్తులు గద్దెలను దర్శించుకొని మొక్కుబడులు చెల్లిస్తారు. ఇరవై ఆరేళ్ల క్రితం ప్రారంభమైన జాతర ప్రతీ రెండేళ్లకోసారి జరుగుతుంది. చినమేడారంగా పేరు గాంచిన మారాయిగూడెం జాతరను ఎంతో మంది ప్రముఖులు దర్శించుకుంటారు. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న జాతర మండమేలుగుతో ప్రారంభమై, తల్లిని గుట్టకు సాగనంపడంతో ముగుస్తుంది. మండమేలుగుట, దేవత నిశానులు సారల మ్మ గుడికి రావడం, నిండు జాతర, శంకు పండుగ, తల్లి దేవత గుట్టకు తిరిగి వెళ్లడం జాతరలో ప్రధాన ఘట్టాలుగా ఉంటాయి. రెండు తెలుగురాష్ట్రాలతోపాటు ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకోవడం ఏళ్ల తరబడి ఆనవాయితీగా వస్తోంది. ఫిబ్రవరి 27 నుంచి మార్చి 3వ తేదీ వరకు ఐదురోజుల పాటు జాతరను మహోత్సవంగా జరిపేందుకు కమిటీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. 27న మండమెలుగుట, 28న సారలమ్మ గుడికి వచ్చుట, 29న సమ్మక్కను గద్దెలపైకి రావడం, మార్చి 1న శుంకు పండుగ, మార్చి 2న తల్లిదేవత తిరిగి గుట్టకు వెళ్లడంతో జాతర ముగుస్తుంది. ఈ ఏడాది సమ్మక్క తల్లిను గుట్ట నుంచి గద్దెల వద్దకు తీసుకొని వచ్చేందుకు గ్రామపంచాయతీ ని ధులతో రహదారి నిర్మాణం జరిగింది. త్రాగునీటి స దుపాయం, పారిశుధ్యం ఏర్పాట్లను మండల పంచాయ తీ అధికారులు ఏర్పాటు చేస్తారు. దేవరబాలలు సోడి శాంతమ్మ, అచ్చమ్మల ఆధ్వర్యంలో జాతరను నిర్వహిస్తారు.


ముస్తాబైన మారాయిగూడెం గద్దెలు

మాజీ ఎమ్మెల్యే మెచ్చాను కలిసిన రేగా

దమ్మపేట, ఫిబ్రవరి 25 : మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తాటిసుబ్బనగూడెంలో ఆయన నవాసంలో శనివారం రాత్రి కలిసారు. అశ్వారావుపేట మండలంలో జరిగిన ఒక వేడుకలో పాల్గొని వెళుతు మెచ్చాను కలిసారు. కొద్దిసేపు పార్టీ రాజకీయాలపై చర్చించినుట్లు సమాచారం. అనంతరం పట్వారిగూడెంలో బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు దొడ్డాకుల రాజేశ్వరరావు అనారోగ్యానికి గురికాగా ఆయనను రేగా పరామర్శించి ఆరోగ్యపరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

అమరవీరుల గాథలు వెలుగులోకి తేవడం అభినందనీయం

- తెలంగాణ సాయుధ పోరాట యోధుడు సోయం గంగుల పుస్తకావిష్కరణ సభలో వక్తలు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఫిబ్రవరి 25: తెలంగాణ సాయుధ పోరాటానికి పూర్వమే నాడు వరంగల్ జిల్లా పరిధిలో ఉన్న ఖమ్మం జిల్లాలో అనేక మంది వీరులు తమ ప్రాణాలను ప్రజల కోసం దారపోశారని, అటువంటి మరుగున పడిన అమరవీరుల జీవిత చరిత్రలను పుస్తకాల రూపంలో తిరిగి ప్రజల ముందుకు తీసుకొచ్చి ప్రజల్లో ఆ నాటి నాయకుల చైతన్య స్ఫూర్తిని రవన్న మెమోరియల్ ట్రస్ట్ బయటకు తీయటం అభినందనీయమని వక్తలు కొనియాడారు. ఆదివారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సోయం గంగులు చారిత్రక నవలను సీనియర్ న్యాయవాది వడ్డెల్లి కృష్ణమూర్తి, రాయల చంద్రశేఖర్, గుర్రం అచ్చయ్య, పుసులూరి నరేందర్ ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతు సాయుత తెలంగాణ పోరాట మంటే ప్రతి ఒక్కరికి నల్లగొండలో జరిగిన పోరాటాలు గుర్తు కోస్తాయని కానీ అంతకంటే ముందే పాల్వంచ గిరిజన ప్రాంతంలో సోయం గంగులు ఆధ్వర్యంలో నిజాంపై వందల మంది గిరిజనులతో పోరాటం చేశారని సోయం గంగుల చరిత్రను వివరించారు. జమిందార్లు, జాగిదారులకు వ్యతిరేకంగా నడిపిన పోరాటం నేటి యువతకు ఆదర్శమ న్నారు. అయితే సోయం గంగులు లాంటి అమరవీరులు జీవితాలు నేటి సమాజానికి తెలియాలని, ఆ నాటి పత్రికలు, కథనాలు, సోయం గంగులతో సంబంధాలు ఉన్న వ్యక్తులతో మాట్లాడి కొన్ని రోజులు పాటు నిర్విరామంగా పనిచేసి సోయం గంగుల జీవితి చరిత్ర నవలను సమాజం ముందు ఉంచటం జరిగిందన్నారు. నవల రూపకల్పనలో పనిచేసిన ఆర్ శివలింగం, డా కే ముత్యంలను అభినందించారు. రవన్న ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడోవ అమరవీరుడు సోయం గంగుల జీవిత చరిత్రను పుస్తకావిష్కరణ జరిగిందని వివరించారు. ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు, ఆవుల వెంకటేశ్వర్లు, యాదయ్య, వై కృష్ణయ్య, చావా రమేశ్, రాయల రవికుమార్, ఆర్ఆర్ ప్రసాద్, అవుల అశోక్ పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణలో సీనియర్ న్యాయవాది కృష్ణమూర్తి, రవన్న ట్రస్టు సభ్యులు

మక్కల కొనుగోళ్లు ప్రారంభం

● మద్దతుకు మించి ప్రైవేటు వ్యాపారుల ఖరీదు

చింతకాని, ఫిబ్రవరి 25: గ్రామాల్లో మక్కల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ప్రభుత్వ మద్దతు ధర రూ.2090కు మించి ప్రైవేటు వ్యాపారులు మొక్కజొన్నలను రూ.2200 కొనుగోలు చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షపాతం ఆశాజనకంగా లేకపోవడం, నీరు లేక సాగర్ ఆయకట్టు భూములు బీళ్లుగా మారడంతో మొక్కజొన్న విస్తీర్ణం సగానికి పైగా పడిపోయింది. యాసంగి పంటగా నవంబరు నుంచి జనవరి వరకు బోర్లు, బావుల ద్వారా నీరు అందుబాటులో ఉన్న చోట నీటి లభ్యతను బట్టి రైతులు కొంత మేర మొక్కజొన్న సాగు చేశారు. అయితే గతేడాది కంటే ఈ ఏడాది పంట దిగుబడులు ఎకరాకు 2 నుంచి 5 క్వింటాళ్ల వరకు తగ్గుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట కోతలు, అమ్మకాలు మే నెల చివరి వరకు కొనసాగే అవకాశం ఉన్నది. వ్యాపారులు జిల్లాలో కొనుగోలు చేసిన మొక్కజొన్నలను హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని హనుమాన్ జంక్షన్, దేవరపల్లి, చింతలపూడి, తణుకు, ఏలూరు, జంగారెడ్డిగూడెం, కైకలూరు ప్రాంతాలలోని కంపెనీలకు ఎగుమతులు చేస్తారు. వ్యాపారులు ప్రస్తుతం ఉన్న ధరతోనే చివరి వరకు మొక్కజొన్నలను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.


మక్కల కాటా ప్రారంభిస్తున్న హమాలీలు

క్రీడలతో మానసికోల్లాసం

- తుంబూరి దయాకర్‌రెడి ▸ పీఎస్ఆర్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 25: ఖమ్మం రూరల్ మండల పరిధిలోని కరుణగిరి సమీపంలోని మైదానంలో రెండు వారాలుగా నిర్వహిస్తున్న పాలేరు నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ముగిసాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆదివారం మంత్రి కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతు పోటీల ద్వారా మంచి స్నేహ భావం ఏర్పడుతుందని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో కాస్త సమయం క్రీడలకు వెచ్చిస్తే మానసిక ఉల్లాసం తోపాటు క్రీడా స్ఫూర్తి అలవడుతుందన్నారు. పీఎస్ఆర్ క్రికెట్ టోర్నీకి మంచి స్పందన వచ్చిందని ఎక్కువ సంఖ్యలో జట్లు తరలిరావడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి సునీల్ రెడ్డి, చావా శివరామకృష్ణ, మార్కెట్ కమిటి మాజీ ఛైర్మన్ మల్లారెడ్డి, మండల నాయకుడు మద్ది వీ రారెడ్డి, బానోత్ హరినాయక్, కిశోర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కొండం రామస్వామి పాల్గొన్నారు.


విజేతలతో తుంబూరి దయాకర్‌రెడ్డి

డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లకు ఘననివాళి

- శ్రద్ధాంజలి ఘటించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల, మల్లు రవి, ఎమ్మెల్యేలు, నాయకులు

వైరా, ఫిబ్రవరి 25: మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామంలో ఆదివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోదరుడు, విశ్రాంత ఆయూష్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు దశదిన కర్మకాండలు జరిగాయి. డిప్యూటీ సీఎం భట్టి , నందిని దంపతులు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి, వైరా, ఇల్లెందు ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్‌నాయక్, కోరం కనకయ్య, రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య తదితరులు డాక్టర్ వెంకటేశ్వర్లు చిత్రపటానికి, సమాధి వద్ద నివాళులర్పించారు. భట్టి విక్రమార్క, తుమ్మల, ఎమ్మెల్యేలు మొక్కలు నాటారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీమంత్రి చిత్తరంజన్‌దాసు, మాజీ ఎమ్మెల్యేలు పొదెం వీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీబీ ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, రైతుబంధు జిల్లా మాజీ కన్వీనర్ నలమల వెంకటేశ్వర్లు, ఏఐసీసీ సెక్రటరీ జెట్టి కుసుమకుమార్, రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షుడు బెల్లయ్యానాయక్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ ఛైర్మన్ సూతకాని జైపాల్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయ క్, ఖమ్మం ఆర్డీవో గణేష్, వైరా తహసీల్దార్, ఎంపీడీవో కేవీ.శ్రీనివాసరావు, సరస్వతీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, దొడ్డా పుల్లయ్య, బీడీకే.రత్నం, ఎంపీటీసీ శీలం వెంకట్రామిరెడ్డి, ఉపసర్పంచ్ మల్లు రామకృష్ణ తదితరులు కూడా డాక్టర్ వెంకటేశ్వర్లుకు నివాళులర్పించారు.


నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి దంపతులు


నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్


సోదరుడి సమాధికి నివాళులర్పిస్తున్న మల్లు రవి

రిజర్వు ఫారెస్టులో ప్లాంటేషన్ కర్రలు మాయం

- అటవీ భుముల ఆక్రమణ ▸ చదును చేస్తున్నా పట్టించుకోని అధికారులు


రిజర్వ్ ఫారెస్ట్‌లో అక్రమార్కులు నరికిన జామాయిల్ చెట్లు

పాల్వంచ, ఫిబ్రవరి 25: పాల్వంచ అటవీశాఖలో పని చేస్తున్న అధికారులు అడవులను అమ్మడానికి సిద్దమౌతున్నారా? అనే అనుమానాలు వస్తున్నాయి. పాల్వంచ మండలం సూరారం బూడిదవాగు ప్రాంతాన్ని సందర్శిస్తే ఎవరికైనా ఇవే ప్రశ్నలు రాక మానవు. పాల్వంచ మండల పరిధిలోని సూరారం గ్రామ పంచాయతీ శివారులో అటవీశాఖ ఆదీనంలో సూరారం రిజర్వ్ ఫారెస్ట్, సూరారం బీట్, కంపార్టుమెంట్ నెంబర్ 255లో జామాయిల్ ప్లాంటేషన్ ఉంది. రిజర్వ్ ఫారెస్టను రైతుల ఆక్రమించారని వారినుంచి ఎనిమిది సంవత్సరాల క్రితం అటవీ అధికారులు స్వాధీనం చేసుకుని ఆ ఏరియా నందు ఓ స్వచ్చంద సంస్థ సహకారంతో జామాయిల్ మొక్కలను నాటారు. అప్పటి నుంచి అటవీశాఖ ఆదీనంలో ఉన్న ఆ ప్లాంటేషన్ ఏపుగా పెరిగింది. ఇప్పుడు అందులోని జామాయిల్ కర్రల పై కన్నేసిన కొందరు అక్రమార్కులు దశల వారీగా కర్రలను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక వేళ అది ప్రైవేటు వ్యక్తులకు సంబందించినదైనా కూడా అటవీశాఖ వారి అనుమతి తీసుకుని వారు ధృవీకరించిన పర్మిట్ పై మాత్రమే తరలించాలి. కానీ ఇక్కడ నిబంధనలు ఏవీ పాటించలేదు. దానికి తోడు దశల వారీగా అడవిని నరికి, చదును చేసి పంటపొలాలుగా మార్చుకుని ఆక్రమించుకోవాలని కొందరు పథకం పన్నారని, ఆ క్రమంలోనే క్రింది స్థాయి సిబ్బందికి భారీగానే ముడుపులు అందాయనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులకు కనీస సమాచారం లేకపోవడం గమనార్హం. అంతే కాకుండా ప్లాంటేషన్ దిగువన ఉన్న రిజర్వ్ పారెస్ట్ ఏరియాను అక్రమార్కులు రెండు రోజులుగా భారీ యంత్రాలతో చదును చేస్తున్నారు. చదును చేసిన ఆ ప్రాంతం రియల్ ఎస్టేట్ వెంచర్‌ను తలపిస్తుందంటే అతిశయోక్తి కాదు. సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో భారీ చెట్లను తొలగించారు. రాళ్ళు రప్పలను పక్కనే ఉన్న వాగులోకి నెట్టారు. ఆ పక్కనే ఉన్న మరో బ్లాకును కూడా చదును చేశారు. పట్టణానికి కూతవేటు దూరంలోని రిజర్వ్ పారెస్ట్‌లో ఇటువంటి ఆక్రమణలు జరుగుతున్నా అటవీశాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా అటవీశాఖ ఉన్నతాధికారులు తగు రీతిలో స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపితే వాస్తవాలు వెలుగుచూసే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయంపై అటవీ అధికారి అనీల్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ అడుగగా ఆ ఎటువంటి ఫిర్యాలు నా దృష్టికి రాలేదని, వస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.


చదును చేసిన రిజర్వ్ పారెస్ట్

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
సోమవారం 26 ఫిబ్రవరి 2024



రేగాతో రాకేష్ రెడ్డి భేటీ

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 25: మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, సబ్ డివిజన్ ముఖ్య నాయకులతో ఉమ్మడి ఖమ్మం జిల్లా, వరంగల్, నల్గొండ ఎమ్మెల్సీ టికెట్ ఆశావాహి రాకేష్‌రెడ్డి ఆదివార భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరారు. నియోజకవర్గంలో ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్‌కు ఎమ్మెల్సీ ఓటర్ల సహకారం ఏ మేరకు ఉంటుందన్న విషయంపై మండలాల వారిగా ఆరా తీసారు. ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి అత్యధికంగా ఎమ్మెల్సీ ఓట్లను సాధించేందుకు అనుసరించాల్సిన విధి విదానాలపై రేగా, ముఖ్య నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పోటీచేసేందుకు టికెట్ ఇచ్చేందుకు సానుకూలంగా ఉన్నారని, ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాలోని పట్టభద్రులు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

రైతులను ముంచిన వరి విత్తనం

మాయ మాటలు.. తాలు విత్తనాలు..
'నకిలీ' విత్తనాలతో మోసపోయిన గిరిజన రైతులు..
ములకలపల్లి, పాల్వంచ మండలాల్లో నష్టపోయిన రైతులు..
సుమారు 60 ఎకరాల్లో తాలు కంకులతో ఈనిన వరి
తమను ఆదుకోవాలంటున్న రైతులు

పాల్వంచ రూరల్, ములకలపల్లి, ఫిబ్రవరి 25: ఏజెన్సీలో గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని పలు కంపెనీలు కొన్ని నకిలీ విత్తనాలను విక్రయించి రైతులను నట్టేట ముంచాయి. రైతులు, కౌలు రైతులు అప్పులు చేసి వరి పొలాలు కౌలు తీసుకొని అధిక పెట్టుబడులు పెట్టి వరి పంట వేశారు. విత్తు నాటిన నుంచి రెండు నెలల లోపే పొలం ఎదగక ముందే ఈని వరి కంకి తాలుగా మారింది.. దీంతో రైతులు నివ్వెరపోయి ఏమి చేయాలో పాలుపోక, నకిలీ విత్తనాలతో నష్టపోయామని గుర్తించి లబోదిబోమంటున్నారు. జిల్లాలోని ములకలపల్లి, పాల్వంచ మండలాల్లో సుమారు 30 మంది రైతులు 60 ఎకరాల్లో నకిలీ వరి విత్తనాలు వేసి తీవ్రంగా నష్టపోయారు.. దీనిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

సుమారు 60 ఎకరాల్లో వరి నష్టం..

ములకలపల్లి మండలంలోని తాళ్లపాయి గ్రామానికి చెందిన సుమారు 26 మంది గిరిజన రైతులు పాములేరు వాగు పుణ్యమా అంటూ యాసంగి సాగు వరి పంట వేశారు. కొంతమంది కౌలు ఎకరానికి రూ. 5వేలు నుంచి రూ. 10వేలు వరకూ చెల్లించి వరి పొలాలు కౌలుకు తీసుకున్నారు. పంట పెట్టుబడికి కొంతమంది అప్పులు చేసి వడ్డీకి డబ్బులు తెచ్చి ములకలపల్లి, పాల్వంచలో ఫెర్టిలైజర్ షాపుల్లో వరి విత్తనాలు కొనుగోలు చేశారు. పాల్వంచ మండలంలో దంతెలబోర గ్రామాల్లో రైతులు 8 ఎకరాల్లో నకిలీ విత్తనాలు నాటి నష్టపోయామని బాధపడుతున్నారు. విత్తు నాటి మొదలుకొని నాటు వేసిన రెండు వారాల్లోనే వరి పొలం కంకులు ఈనింది. రెండు నెలల లోపే వరి ఈనడంతో రైతులు నివ్వెర పోయి నకిలీ విత్తనాలతో నష్టపోయామని గుర్తించారు.

ప్రభుత్వ ఆదేశాలు భేఖాతార్..

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే ఆ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని, ముందస్తుగానే అధికారులు పలు నకిలీ విత్తనాలు విక్రయించే సంస్థలను గుర్తించి పలు ఫెర్టిలైజర్ షాపులలో తనిఖీలు ముమ్మరం చేసి నకిలీ విత్తనాలు గుర్తించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించినప్పటికీ నిమ్మకు నీరెత్తనట్లు అధికారుల తీరు ఉంది. ఐనప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నకిలీ విత్తనాల వల్ల రైతులు బలై పోతున్నారు. నకిలీ విత్తనాలను రైతులు నమ్మి నట్టేట మునుగుతున్నారు. అభంశుభం తెలియని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

తూతూ మంత్రంగా తనిఖీలు..

నకిలీ విత్తనాలు, ఎరువులు పలు కంపెనీలు ఏజెన్సీలో విక్రయిస్తున్నప్పటికీ ఏదో తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ మమా అని పిస్తున్నారు. పలు సీడ్ కంపెనీలు నకిలీ విత్తనాలు, నాసిరకమైన విత్తనాలు, లైఫ్ టైమ్ అయిపోయిన విత్తనాలు విక్రయిస్తున్నప్పటికీ వ్యవసాయ శాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు నామమాత్రంగానే ఉన్నాయి. పాల్వంచ మండలంలో గత ఐదేళ్ల క్రితం నకిలీ విత్తనాలు నాటి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ములకలపల్లి మండలంలో జగన్నాధపురంలో సుమారు వంద ఎకరాల్లో మొక్కజొన్న సీడ్ నకిలీ విత్తనాలు వేసి తీవ్రంగా నష్టపోయి రైతులు ఆందోళనలు చేసినప్పటికీ నేడు అధికారుల నకిలీ విత్తనాలు అరికట్టడంలో విఫలమవుతున్నారు.



తాలు కంకి ఈనిందని చూపిస్తున్న రైతులు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే.. చర్యలు

బాబూరావు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి

జిల్లాలో ఎవరైనా నకిలీ విత్తనాలు, నాసిరకం విత్తనాలు సరఫరా చేసినా, విక్రయించినా పీడీ యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటాం.. స్థానిక ఏఓ, ఏఈవోల ద్వారా ఆ పంటలను పరిశీలించి నివేదికల ప్రకారం చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ఎవరు నకిలీ విత్తనాలను విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే జారే



జారే దంపతులను సన్మానిస్తున్న గిరిజన ఉపాధ్యాయులు

ములకలపల్లి, ఫిబ్రవరి 25: గిరిజన సంక్షేమ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. కమలాపురం ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు, గిరిజన ఉపాధ్యాయులు కలిసి వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేసి ఎమ్మెల్యే కావటంతో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జారే మాట్లాడుతు ఉపాధ్యాయుడిగా పని చేసిన తనను ఎమ్మెల్యేగా గెలిపించిన అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలందరికి కృతజ్ఞత తెలిపారు. నియోజక వర్గ పరిధిలో తన దృష్టికి వచ్చిన అన్ని వర్గాల ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవిధంగా కృషి చేస్తానన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్ర మైందని ఉపాధ్యాయునిగా వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని విద్యా ర్థులను ఆదర్శ వంతులుగా తీర్చిదిద్దేందుంకు కృషి చేయాలని, విద్యార్థు ఉన్నతే ఉపాధ్యాయులకు దక్కే గౌరమని అన్నారు.

వైభవంగా అమ్మవారి కల్యాణం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం

బూర్గంపాడు, ఫిబ్రవరి 25: బూర్గంపాడు మండల పరిదిలోని భద్రాచలం-మణుగూరు క్రాస్ రోడ్డు నందు ఉన్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో శ్రీ గోపయ్య ఆర్య శ్రీ తిరుపతమ్మ అమ్మవారి కల్యాణమహోత్సవం శనివారం రాత్రి సమయంలో కనులపండుగగా నిర్వహించారు. దేవాలయ సంకల్పకర్త, ఆలయ ప్రధాన అర్చకులు మరైబోయిన గోపాలరావు ఆద్వర్యంలో నిర్వహించిన కళ్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించారు. పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, సొసైటీ మాజీ ఛైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి-ధనలక్ష్మీ దంపతులు, జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత-రామకొండారెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణాన్ని పురష్కరించుకుని ముసలిమడుగు గ్రామానికి చెందిన బట్ట చిన్నవెంకన్న దంపతులు, అచ్చయ్య దంపతులు ఆద్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పోలీసు నిర్బంధాలు నిలిపివేయాలి



మాట్లాడుతున్న రవి

ఇల్లెందు, ఫిబ్రవరి 25: ప్రజాస్వామ్యయుతంగా పాలన చేస్తామని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా గ్రామాల్లో పోలీసుదాడులు, ఆదివాసుల అక్రమ అరెస్టులు కుట్ర కేసులకు పాల్పడుతోందని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా సీఎల్‌సీ కార్యవర్గ సమావేశానికి ఆదివారం ఇల్లెందులో జరిగింది. సమావేశంలో రవి మాట్లాడుతూ.. పూసంపల్లిలో కుట్ర పూరితంగా కేసు నమోదు చేశారని, వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మార్చి 9, 10 తేదీల్లో హైదారాబాద్‌లో జరుగుతున్న పౌరహక్కుల సంఘం 50వ వసంతాల సభలను విజయవంతం చేయాలని కోరారు. న్యూడెమొక్రసి నాయకులపై నమోదు చేసిన పూసపల్లి కుట్రకేసు ఎత్తివేయాలని తీర్మానించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షు కార్యదర్శులు సింగు ఉపేందర్, రామలపావెల్, విప్లవకుమార్, భార్గవి, రమణ, ఉదయ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మేధావుల మౌనం రాష్ట్రానికి నష్టం



మాట్లాడుతున్న రాకేష్ రెడ్డి

ఇల్లెందు, ఫిబ్రవరి 25: మేధావులు మౌనంగా ఉండటం రాష్ట్రానికి ప్రమాదకరమని, పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లుగా నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లా పట్టభద్రుల నియోజవర్గం ఇన్‌చార్జ్ ఎనుగుల రాకేశ్‌రెడ్డి కోరారు. ఇల్లెందులో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే హరిప్రియలతో కలిసి ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ శ్రేణులు గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కు కృషి చేయాలన్నారు. శాసనమండలికి అర్హులైన ప్రతినిధిని పంపడం పట్టభద్రుల భాద్యతన్నారు. గతంలో ఎమ్మెల్సీగా గెలుపొందిన పల్లారాజేశ్వర్ రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందడం వలన ఉప ఎన్నిక జరుగనుందని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు పద్మావతి, శ్రీనివాస్, అజ య్, పద్మ, తార, సుజాత, బీఆర్ఎస్ నాయకులు జనగం కోటేశ్వరావు, వా సు, జబ్బార్, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బావులను ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న కూనంనేని

కొత్తగూడెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సింగరేణి మనుగడ, కోల్‌బెల్టు ప్రాంతాల అభివృద్ధికోసం ప్రతిపాదనలో ఉన్న నూతన భూగర్భ బొగ్గు బావులను ఏర్పాటు చేయాలని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. ఆదివారం రామవరం ఏరియాలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్మించిన సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభం సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రాలు అందించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తిలో అపార అనుభవం ఉన్న సింగరేణి సంస్థకు బొగ్గు బ్లాకులు అప్పగించకుండా కేంద్రం కుట్ర చేస్తుందని, ఇక్కడి బొగ్గు నిక్షేపాలను కార్పోరేట్ సంస్థలకు అప్పగించే కుట్రలో భాగంగా టెండర్లు ఆహ్వానిస్తున్నారని అన్నారు. సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేసేందుకు స్థలాలు కేటాయించాలని కోరారు.


108లో మహిళ ప్రసవం

ములకలపల్లి, ఫిబ్రవరి, 25: మహిళను ప్రసవం కోసం 108 అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో అంబులెన్స్‌లో డెలివరి అయిన ఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. వివరాల ప్రకారం గుండాలపాడు పంచాయతీ పరిధిలోని చింతలపాడు గ్రామానికి చెందిన రాజేశ్వరికి అర్ధరాత్రి తీవ్ర ప్రసవేదనకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇవ్వటంతో సకాలంలో అంబులెన్స్ చింతలపాడు గ్రామం చేరుకుంది. రాజేశ్వరిని ప్రసవం కోసం అంబులెన్స్‌లో బూర్గంపహాడ్ తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే తీవ్ర ప్రసవేదనకు గురైంది. దీంతో ఈఎంటి దుర్గాభవాని అంబులెన్స్‌ను మార్గ మధ్యలో నిలిపివేసి ప్రసవం చేయటంతో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరంలో అదే అంబులెన్స్‌లో బూర్గంపహాడ్ వైద్యశాలకు తల్లి, బిడ్డను తరలించి వైద్య సహాయాన్ని అందించారు. దీంతో వారిద్దరూ క్షేమంగా వున్నారని పైలట్ తిరుపతి తెలిపాడు. అత్యవసర సమయంలో సుఖ ప్రసవం చేసిన వారిని పలువురు అభినందించారు.

ఉప కమిటీ ఏర్పాటుపై హర్షం

దమ్మపేట, ఫిబ్రవరి 25: 317 జీవో బాధిత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంత్రి వర్గ ఉపకమిటి వేయటం పట్ల టీఈఏ గురుకులం రాష్ట్ర అధ్యక్షుడు దమ్మపేట గిరిజన గురుకుల ఉపాధ్యాయులు శ్యామ్ కుమార్ ఆదివారం సాయంత్రం ప్రకటనలో హర్షం వ్యక్తం చేసారు. ప్రభుత్వం 317 జీవోపై ఉపకమిటీ వేయటం ద్వారా బాధితులకు న్యాయం జరుగుతుందని, ఇది మంచి పరిణామమని అన్నారు. కమిటీ సభ్యులు ఉద్యోగుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల ముందే గురుకుల ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలు చేయాలని ప్రభుత్వానికి, సబ్ కమిటీకి ఆయన విజ్ఞప్తి చేసారు.

రామన్నగూడెంలోశుభకార్యంలో పాల్గొన్న ఎమ్మెల్యే



చిన్నారిని ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట, ఫిబ్రవరి 25: మండల పరిధిలోని రామన్నగూడెంలో ఓ శుభకార్యంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. గ్రామంలోని సపకవారి ఓణీల వేడుకల్లో పాల్గొని చిన్నారి సింధుని ఆశీర్వదించారు. అనంతరం అక్కడికి వచ్చిన గ్రామస్థులను గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తన దృష్టికి తేవాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి ఎళ్లవేళలా కృషి చేస్తానని, జిల్లాలో నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందు నిలపటానికి కృషి చేస్తానని అన్నారు. సమస్యల పరిష్కారానికి ముందుంటానని తెలిపారు. సమస్యలు ఎప్పుడైన తన దృష్టికి తేవచ్చున్నారు. కార్యక్రమంలో ప్రమోద్, కానూరి మోహనరావు, మిండా హరి, నారాయణపురం సొసైటీ అధ్యక్షుడు నిర్మల పుల్లారావు, నండ్రు రమేష్, మాజీ సర్పంచ్ దారా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యసహాయానికి ఆర్థిక వితరణ

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 25: రామారావుపేటలో వెన్నెముక వ్యాధితో ఇబ్బంది పడుతూ ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్న ఆదివాసీ నిరుపేద పొడియం రాంబాబుకు పలువురు దాతలు సాయమందించారు. చికిత్సల కోసం రూ.4.50లక్షలు అవసరమని వైద్యులు తెలపగా, ఇప్పటికే బీఎల్ అసోసియేషన్ సపోర్టర్స్ విజయవాడ వైద్యులు డాక్టర్ ప్రవీణ, రాజీవ్, డాక్టర్ పృథ్వీ, బీఎల్ఏ సభ్యులు కలిసి రూ.22వేల నగదు సాయమందించారు. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న అమెరికా వాసి రూ.10వేల నగదును తక్షణ సాయంగా అందించారు. బీఎల్ఏ గౌరవ సభ్యులు వర్సా విష్ణు, నరేష్‌లు బాధితులకు ఆదివారం నగదు అందజేశారు.

గిరిజనులకు దుస్తుల పంపిణీ

పాల్వంచటౌన్, ఫిబ్రవరి 25: పాల్వంచ పట్టణ ప్రముఖులు, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ కొల్లి రాఘవేంద్రరావు గిరిజనులకు ఆదివారం దుస్తులను పంపిణీ చేశారు. బూర్గంపాడు మండలం గుట్ట లక్ష్మీపురం గిరిజన గ్రామస్థులు (ఉడ్‌యార్డ్)120 కుటుంబాలకు చీరలు, లుంగీలు, టవల్స్ అందజేశారు. ప్రతి సంవత్సరం ఇలా చేయడాన్ని ఆనవాయితీగా పెట్టుకున్న ఆయన మాట్లాడుతూ పేదవారికి ఉన్నంతలో ఏదో చేయాలన్న భావనతో ప్రతి సంవత్సరం గిరిజన గ్రామాల్లోని పేదలకు తన వంతుగా దుస్తులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లీడి వెంకటేశ్వరరావు, కర్నాటి రమేష్, వాసు, నల్లమోతు రాజశేఖర్, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

కనగాలకు ఎమ్మెల్యే కూనంనేని పరామర్శ



కనగాలను పరామర్శిస్తున్న కూనంనేని

పాల్వంచటౌన్, ఫిబ్రవరి 25: టీడీపీ రాష్ట్ర నాయకుడు కనగాల అనంతరాములు ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం హైదరాబాద్‌లోనే ఉన్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కనగాల నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని నియోజకవర్గ రాజకీయల్లో చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

నేడు వైస్ ఎంపీపీపై అవిశ్వాసం

అశ్వాపురం, ఫిబ్రవరి 25: బీఆర్ఎస్ పార్టీకి చెందిన అశ్వాపురం వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రంపై అవిశ్వాసానికి సంబంధించి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో భద్రాచలం ఆర్డీవో మంగీలాల్ సమావేశం నిర్వహించనున్నారు. ఇందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో మొత్తం 12 మంది ఎంపీటీసీలకు గాను ఎంపీపీ ముత్తినేని సుజాత సహా 8మంది ఎంపీటీసీలు అవిశ్వాసానికి మద్దతు తెలుపుతున్నారు. ఈ మేరకు జనవరి 30న సదరు ఎంపీటీసీ ఆర్డీవోకు నోటీస్ అందజేశారు. అవిశ్వాస సమావేశానికి కోరం పూర్తి చేయటానికి ఎనిమిది మంది సభ్యులు హాజరు కావాల్సి ఉంది.

అడవిలో ఆక్రమణలు



నివాసం కోసం అడవిని నరికిన దృశ్యం

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 25: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామ సమీపంలోని రథం గుట్టం ప్రాంతంలో నివాసాల పేరుతో అడవిలో ఆక్రమణలు ప్రారంభమయ్యాయి. ఇదివరకు ఇలానే అడవిని ఆక్రమించి తాత్కాలిక నిర్మాణాలు చేపట్టగా వాటిని తొలగించి తిరిగి అటవి భూమిని ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాగా తాజాగా మళ్లీ కొందరు అటవీ ప్రాంతాన్ని చదును చేసి తాత్కాలికంగా అడవిలోని కలపతోనే నివాసం కోసమంటూ నిర్మాణాలను చేపటడుతున్నారు. రెండు రోజుల క్రితం విషయం తెలిసిన అధికారులు ఆ ప్రాంతంలో దాడులు నిర్వహించి ఎస్కవేటర్‌లతో అక్రమ నిర్మాణలను తొలగించారు. కాగా ఆదివారం తిరిగి ఆక్రమణదారులు అడవి ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేస్తున్నట్లు సమాచారం కాగా గతంలోనే అటవీ భూమిని ఆక్రమించి స్థలాలను స్వాధీనంలోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఆ స్థలాల్లో తాత్కాలికంగా అడవి కలప, పొరకలను వినియోగించి తిరిగి నిర్మాణాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ద్వాలియాను వివరణ కోరగా.. కొత్తగా ఆక్రమణలు చేసి అడవి ప్రాంతంలో నిర్మాణాలు చేస్తున్నారన్న సమాచారం మేరకు రెండురోజుల క్రితం అక్రమ నిర్మాణాలు తొలగించామన్నారు. సోమవారం కూడా ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించి అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని, ఆక్రమణలకు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మహబూబాబాద్ గెలుపే లక్ష్యం కావాలి



మాట్లాడుతున్న వెంకట రమణారెడ్డి

మణుగూరు, ఫిబ్రవరి 25: మహబూబాబాద్ పార్లమెంటరీ స్థానంలో పోటీచేసే బీజేపీ అభ్యర్థిని గెలిపించుకొని దేశ అభివృద్ధి మలుపునకు స్థానిక ప్రజలు నాంది పలకాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం భద్రాచలంలో ఆరంభమైన బీజేపీ విజయ సంకల్ప యాత్ర మణుగూరుకు సాయంత్రం చేరుకుంది. అంబేద్కర్ సెంట ర్‌లో సంకల్ప యాత్ర కార్నర్ మీటింగ్‌ను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడారు. దేశ ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ పార్టీ ఏర్పాటు చేస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని ముచ్చటగా మూడోసారి గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పోడియం బాల రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, మాజీ శాసన సభ్యులు ధర్మా రావు, ప్రభారి వెంకట నారాయణ రెడ్డి, జిల్లా అధ్యక్షులు రంగా కిరణ్, చాడా శ్రీనివాసరెడ్డి, ప్రభారి కృష్ణవేణి నాయక్, ముస్కు శ్రీనివాసరెడ్డి, జంపన సీతా రామరాజు, మండల అధ్యక్షుడు లింగంపల్లి రమేష్, రామకృష్ణ, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

మరోసారి మోదీ సర్కార్

లక్ష్మీదేవిపల్లి: మోదీతోనే అభివృద్ధి సాధ్యమని దేశ ప్రజలు భావిస్తున్నారని, ప్రజల ఆశీర్వాదంతో మరోసారి మోదీ సర్కార్ వస్తుందని బీజేపీ కామరెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి అన్నారు. రాష్ట్రంలోనే ఒకే ఒక ఎమ్మెల్యే సీటు ఉన్న కమ్యునిస్టులతో ప్రజలకు ఒరిగేది ఏమిలేదని ఎద్దేవా చేసారు. ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయసంకల్ప యాత్రలో భాగంగా కొత్తగూడెంలో ఏర్పాటుచేసిన కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికి ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారేంటీలపై ఒక స్పష్టతలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టకున్నాడు తప్ప ఇచ్చిన హామీల అమలుపై దృష్టిపెటడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్, జిల్లా నాయకులు ధర్మారావు, వినోదరావు, శ్రీకాంత్, వాసుదేవరావు, ఆకుల నాగేశ్వరరావు, రాయుడు నాగేశ్వరరావు, నరేందర్, నాయకులు పాల్గొన్నారు.

రహదారులపైనే పశువులు

త్రుటిలో తప్పుతున్న ప్రమాదాలు.. పట్టించుకోని యాజమానులు



రహదారిపై పశువుల సంచారం

మణుగూరుటౌన్, జనవరి 25 : మణుగూరు పట్టణంలో ప్రధాన రహదారులే పశువుల నెలవుగా మారింది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా రోడ్లపైనే సేద తీరుతూ.. చిరు వ్యాపారాలు, హోటల్లు, కిరాణాషాపుల వాల్లు రోడ్లపై వేసే చెత్తనే ఆహారంగా మేస్తూ సంచరిస్తున్నాయి. అడ్డుఅదుపులేని సంచారంతో త్రుటిలో పెను ప్రమాదాలు తప్పిపోతున్నాయి. రహదారులపై తరుచు జరిగే ప్రమాదాలకు పశువులే ప్రధాన కారణంగా కనిసిస్తున్నాయన్న ఆరోపణలు వెళ్లవిరుస్తున్నాయి. రహదారులపై ఇష్టానుసారంగా సంచరించే పశువుల విషయంలో అప్రమత్తంగా లేకపోతే ఇక అంతే సంగతులు అన్నచందంగా పరిస్థితి మారింది. పశువుల సంచారం మరింతగా పెరిగి వచ్చి.. పోయే వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారడంతోపాటు ప్రలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వీటికి సంబంధించిన యజమానులు ఎవరో.. వారు ఎక్కడ ఉంటారో అన్నది మాత్రం అంతుచిక్కని ప్రశ్నగానే మిగిలిపోతోంది. రాత్రివేళల్లో జరిగే ప్రమాదాల వలన పలువురు గాయాలు పాలుకాగా.. పశువుల సైతం మృతి చెందిన, గాయపడిన ఘటనలు ఉన్నాయి. పలు పార్టీల నాయకులు, ప్రజలు, వాహనచోదకులు పశువుల సంచారంపై మండలంలో సంబంధిత అధికాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అడ్డగోలుగా రహదారులపై తిరుగుతున్న పశువులను తరలించేందుకు పంచాయతీ, మున్సిపల్ అధికారులు కనీసం బందెల దొడ్లను సక్రమంగా నిర్వహించడంలేదన్న ఆరోపణలు లేకపోలేదు. పేరుకు మాత్రమే బందెల దొడ్లు ఉన్నాయని మాత్రమే తెలిసిన విషయం కాగా అవి ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి పశువులను బందెల దొడ్లో ఉంచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లక్ష్మణరావును పరామర్శించిన ఎమ్మెల్యే



లక్ష్మణరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట, ఫిబ్రవరి 25: లింగాలపల్లి గ్రామానికి చెందిన కొర్సా లక్ష్మణరావును అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆయన నివాసంలో ఆదివారం పరామర్శించారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో లక్ష్మణరావు గాయపడగా ఎమ్మెల్యే సహకారంతో ఖమ్మం ప్రవేటు వైద్యశాలలలో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన పరామర్శించి ఆరోగ్యపరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కొలుకోవాలని ఎమ్మెల్యే ఆకాక్షించారు.

'నెలనెలా వెన్నెల'తో

నాటకరంగానికి పూర్వవైభవం

ఉమ్మడి రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన సాంస్కృతిక సంస్థ

ఖమ్మం సాంస్కృతికం ఫిబ్రవరి 25: 'ఇంతితై వటుడింతై' అన్న చందంగా 'నెలనెలా వెన్నెల' ఎదిగి తెలుగు నాటక రంగంలో ప్రముఖస్థానంలో అలరారుతోంది. నెలనెలా వెన్నెల సాంస్కృతిక సంస్థ ఖమ్మం నగరం కేంద్రంగా రెండు తెలుగు రాష్ట్రాల కళాకారుల ప్రతిభను వెలుగులోకి తెస్తూ.. తన వంతు సాంస్కృతిక సేవ సాగిస్తోంది. 2007లో మొదలైన సాంస్కృతిక ప్రయాణం.. నేటికీ కొనసాగుతుండటం గమనార్హం.. మొదట ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో మొదలైన ఖమ్మం నాటక రంగ మలి విడత ప్రస్థానం భక్తరామదాసు కళాక్షేత్రం వేదికగా 13నెలల పాటు నిరంతరాయంగా సాగింది. ఆ కాలంలో ఆడిటోరియంలో మైకులు, కర్టెన్లు, కుర్చీలు వంటివి తగినన్ని లేకపోవటంతో ప్రదర్శకులు టెంట్ హౌస్‌లనుంచి విజయవాడ నుంచి తెప్పించి ప్రదర్శించేవారు. ఆ తరువాత ఆర్థిక సమస్యలు వేధించటంతో మరలా 2015లో 'నెలనెలా వెన్నెల' పేరుతో తెలంగాణ ఉద్యమ తొలితరం యోధుడు, నాటక రంగానికి కృషి చేసిన అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ పేరుతో సంస్థ, ప్రజానాట్యమండలి, ఖమ్మం కళాపరిషత్‌లు ఉమ్మడిగా నెలనెలా వెన్నెల నాటక సంస్థ బాధ్యతలు తలకెత్తుకున్నాయి. నాటక కార్యక్రమాలకు మూడు సంస్థల సహాయ సహకారాలతోపాటు భాషా సాంస్కృతిక సంస్థ ద్వారా ప్రభుత్వ సాయం కోరారు. సంస్థకుగల కళాసేవను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఏటా రూ.2లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. కాగా ప్రతి నాటిక ప్రదర్శనకు రూ.70 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఖర్చవుతుండటంతో స్థానిక దాతల విరాళాలు సేకరిస్తున్నారు. పొందిన విరాళాల ఖర్చులో పారదర్శకత పాటించేందుకు ఆడిట్ నిర్వహించి ప్రభుత్వానికి మీడియాకు అందజేస్తున్నారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక కళా, సాంస్కృతిక నాటక రంగ సంస్థలు ప్రముఖమైనవి ఉన్నప్పటికీ వాటిల్లో ఏవీ క్రమం తప్పకుండా సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వటం లేదు. ఖమ్మంలో మాత్రమే ప్రతినెలా సాంస్కృతిక ప్రదర్శనకు అవకాశం ఉండటంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ నాటక కళాకారులు, తమ సంస్థల ఆధ్వర్యంలో స్థానిక వేదికపై ప్రదర్శనలిచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఖమ్మంలో ఉత్తమ అభిరుచిగల నాటక రంగ ప్రేక్షకాదరణతోపాటు ప్రముఖ కవులు, నిష్ణాతులైన కళాకారులు, అభ్యుదయ వాదులు ఉండటంతో రెండు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల కళాకారులకు తమ ప్రదర్శనపై ఫీడ్ బ్యాక్ పొందేందుకు అనువుగా ఉంది. ఖమ్మంలో ప్రదర్శన అనంతరం నాటికకు సంబంధించిన బలాబలాలను తెల్పి చెప్పే అనుభవ వంతులు ఉండటంతో కళాకారులు తమ నాటికలోని లోపాలను సైతం సవరించుకొని ఇతర ప్రాంతాల్లో ఉత్తమ ప్రదర్శనలు కనబరుస్తున్నారు. నాటకాల ప్రదర్శనల సమయంలో ప్రముఖులైన నాటక కళాకారులతోపాటు ప్రతినెలా ఒకరిద్దరు చొప్పున పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. పరుచూరి వెంకటేశ్వరరావు, గోపాలకృష్ణ సోదరులతోపాటు గొల్లపూడి మారుతీరావు, రాళ్లపల్లి, తనికెళ్ల భరణి, జయప్రకాష్ రెడ్డి, రాజ్యలక్ష్మి, అందెశ్రీ, ఆర్.నారాయణమూర్తి, సప్తగిరి, రమణాచారి, వైజాగ్ ప్రసాద్ తదితరులు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు పాల్గొన్నారు.

నాటక ప్రదర్శనలు కొంతకాలం ఆగి పోయాయి. ఆ తరువాత ప్రఖ్యాత ఖమ్మం కళాపరిషత్ సంస్థ నాటక ప్రదర్శనకు పూనుకొని 33నెలల పాటు నెలనెలా ప్రదర్శనలు ఏర్పాటు చేసింది. అయితే ప్రసిద్ధ నాటకాలను ఏర్పాటు చేస్తున్నప్పటికీ ప్రేక్షకుల స్పందన కొరవడుతుండటంతో కార్యక్రమాలను నిలిపి వేశారు. నాటక రంగ పునరుజ్జీవనం లక్ష్యంగా కళారంగంపై మక్కువతో



నాటక ప్రదర్శనకు హాజరైన గొల్లపూడి మారుతీ రావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం (ఫైల్)

ప్రత్యామ్నాయ సంస్కృతి నిర్మాణం ధ్యేయంగా..

ఎ.సుబ్రమణ్యకుమార్ నెలనెలా వెన్నెల కార్యదర్శి



విష సంస్కృతి, సంప్రదాయాలకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ వారసత్వ కళా సంస్కృతిని నిర్మించేందుకు కళారంగానికి పూర్వ వైభవం సాధించేందుకు నెలనెలా వెన్నెల నాటక సంస్థ స్థాపనకు పూనుకున్నాం.. నాటక కళాకారులకు నెలనెలా వెన్నెల ద్వారా ప్రోత్సాహం అందుతోంది. స్థానికంగా ప్రదర్శనలు ఇచ్చేందుకు ప్రముఖ నాటక సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి.

ఖమ్మం కళల గుమ్మం అని నిరూపిస్తున్నారు..

మోటమర్రి జగన్మోహన్ రావు అధ్యక్షుడు



ఖమ్మం కళల గుమ్మం అన్న నానుడిని నిజం చేస్తూ నెలనెలా వెన్నెల నాటక ప్రదర్శనలు సాగుతున్నాయి.. నాటక కార్యక్రమాలకు ప్రేక్షకుల ఆదరణ క్రమంగా పెరిగింది. ప్రతి ప్రదర్శనకు ప్రేక్షకుల హాజరు ఆశాజనకంగా ఉంటోంది. స్థానికంగా నాటక రంగ అభిమానులు అధికంగా ఉండటం ఇందుకు కారణం..

నాటక రంగానికి నెలనెలా కళల వెన్నెల..

వేముల సదానంద్ ప్రజానాట్యమండలి అధ్యక్షుడు, గాయకుడు



నాటక రంగానికి ప్రతినెలా కళల వెన్నెలగా మారటానికి నెలనెలా వెన్నెల కార్యక్రమం ఎంతగానో దోహద పడుతోంది. నెలనెలా వెన్నెల పేరు పెట్టటంలో, కార్యక్రమ రూప కల్పనలో ప్రముఖ రచయత, నాటక రంగ ప్రముఖుడు దేవేంద్ర కృషి ఉంది. దారిచూపు దీపాన్ని వెలిగించగా, అలుముకున్న చీకట్లను తొలగించగా అన్న శీర్షిక గీతంలో నెలనెలా వెన్నెల కార్యక్రమ ధ్యేయాన్ని వివరించటం జరిగింది.



వాహన సేవను ప్రారంభిస్తున్న ఈవో రమాదేవి

రామాలయంలో

నిత్యకల్యాణాల పునః ప్రారంభం

- కల్యాణంలో పాల్గొన్న 118 జంటలు
- చిన్న గరుధ వాహన సేవలు ప్రారంభం

భద్రాచలం, ఫిబ్రవరి 25: భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి నిత్యకల్యాణాలు పునః ప్రారంభమయ్యాయి. సహస్ర కలశాభిషేక మహోత్సవాలను పురస్కరించుకొని రెండు రోజులపాటు నిత్యకల్యాణాలను నిలిపివేయగా.. ఆదివారం పునః ప్రారంభమయ్యాయి. స్వామివారం నిత్యకల్యాణంలో 118 జంటలు పాల్గొనడం విశేషం. ఇదిలా ఉండగా భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో నూతన ఆర్జిత సేవగా చిన్న గరుడ వాహన సేవకు శ్రీకారం చుట్టారు. నిత్య కల్యాణమూర్తులతోపాటు చిన్న గరుఢ వాహన సేవ టికెట్ రూ.250గా అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో ఈ సేవను దేవస్థానం ఈవో రమాదేవి పర్యవేక్షణలో వైదిక సిబ్బంది ప్రారంభించారు.



కల్యాణ పత్రికను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ వివేక్

గుట్ట వెంకన్న

కల్యాణ పత్రిక ఆవిష్కరణ

పాల్వంచటౌన్, ఫిబ్రవరి 25: పట్టణ పరిధి శ్రీనివాసకాలనీ శ్రీనివాసగిరి (గుట్ట) వెంకన్న కల్యాణ శుభపత్రికలను స్వామివారి పాదాల మండపం వద్ద ఆదివారం పాల్వంచ తహసీల్దార్ వివేక్ ఆవిష్కరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు నగేష్ శర్మ, ఫణిరాజాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు ఆయన స్వయంగా ఆహ్వాన పత్రికలను అందజేశారు.

ఏప్రిల్ 3 నుంచి 6 వరకు జరిగేవార్షిక కల్యాణంలో భాగంగా ఏప్రిల్ 4న జరిగే శ్రీదేవి- భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణాన్ని భక్తులు తిలకించాలని ఆలయ కమిటీ, నిర్వహకులు కోరారు. కార్యక్రమంలో డాక్టర్ బిక్కసాని సుధాకర్, భక్త సమాజం మండలి, పసుమర్తి వెంకటేశ్వరరావు, ఆరుట్ల లక్ష్మణాచార్యులు, ధర్మపురి రాము, ఊకే భద్రయ్య, కందుకూరి రామకృష్ణ, తాటికొండ శ్రీలత, మేదరమెట్ల శ్రీనివాసరావు, చనుమోలు శ్రీనివాసరావు, నరసింహకుమార్ పాల్గొన్నారు.

నివాసాల పేరుతో అడవిలో ఆక్రమణలు

- తాత్కాలిక నిర్మాణాలు చేస్తున్న వైనం
- ఆక్రమణలు తొలగిస్తాం : ఎఫ్ఆర్‌వో ద్వాలియా

మణుగూరుటౌన్, ఫిబ్రవరి 25: మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామ సమీపంలోని రథం గుట్ట ప్రాంతంలో నివాసాల పేరుతో అడవిలో ఆక్రమణలు ప్రారంభమయ్యాయి. ఇదివరకు అడవిని ఆక్రమించి తాత్కాలిక నిర్మాణాలు చేపట్టగా వాటిని తొలగించి అటవి భూమిని ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాగా తాజాగా కొందరు అటవీప్రాంతాన్ని చదును చేసి తాత్కాలికంగా అడవిలోని కలపతోనే నివాసం కోసమంటూ నిర్మాణాలను చేపటడుతున్నారు. రెండు రోజుల క్రితం విషయం తెలిసిన అధికారులు ఆ ప్రాంతంలో దాడులు నిర్వహించి ఎక్స్‌కవేటర్‌లతో అక్రమ నిర్మాణాలను తొలగించారు. కాగా ఆదివారం తిరిగి ఆక్రమణదారులు అడవి ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేస్తున్నట్లు సమాచారం. కాగా గతంలోనే అటవీ భూమిని ఆక్రమించి స్థలాలను స్వాధీనంలోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఆ స్థలాల్లో తాత్కాలికంగా అడవి కలపను వినియోగించి తిరిగి నిర్మాణాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ద్వాలియాను వివరణ కోరగా.. కొత్తగా ఆక్రమణలు చేసి అడవి ప్రాంతంలో నిర్మాణాలు చేస్తున్నారన్న సమాచారం మేరకు రెండురోజుల క్రితం అక్రమ నిర్మాణాలు తొలగించామన్నారు. సోమవారం కూడా ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించి అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని, ఆక్రమణలకు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



లకారానికి వెళ్లేది ఈ నీళ్లే..

పాలేరు జలాశయంనుంచి వచ్చే సాగర్ జలాలను నగరంలోని టేకులపల్లి బ్రిడ్జి వద్ద మళ్లించి లకారంలోకి కాలువద్వారా పంపుతున్నారు. అయితే సదరు నీళ్లలో పాచి పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. ఈ నీళ్లే లకారం చెరువులోకి వెళ్తున్నాయి. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు లకారం చెరువులో బోటింగ్ ఏర్పాటు చేశారు. దీంతో సందర్శకులు, బోటింగ్ చేసేవారు ఇబ్బంది పడే అవకాశం ఉంది. అధికారులు ఆ నీళ్లను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఫొటో: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

వివాహ వేడుకలకు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల



వధువరులతో డిప్యూటీ సీఎం, మంత్రి, ఎమ్మెల్యేలు

టేకులపల్లి ఫిబ్రవరి 25: భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండలంలోని కోయగూడెం పంచాయతీ రావులపాడు గ్రామంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఏలూరు కోటేశ్వర కుమారుడి వివాహానికి ఆదివారం రాత్రి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై తన వధూవరులు ఆదిత్య, సుప్రియ లను ఆశీర్వదించారు. హాజరైన వారిలో డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, ఇల్లందు వైరా పినపాక ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, మాలోతు రామదాసు నాయక్, పాయంవెంకటేశ్వర్లు ఉన్నారు. అంతకుముందు వారు దారిలో బోయగూడెం గ్రామంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇంటి వద్ద ఆగి తేనేటి విందు స్వీకరించారు

మాస్‌లైన్ మహాసభలు విజయవంతం చేయండి: ప్రజాపంథా

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 25: మార్చి 3,4,5 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఆల్ ఇండియా మహసభలను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని ఎం వెంకటయాపాలెం గ్రామంలో ఆదివారం ద్విచక్రవాహనర్యాలీ నిర్వహించారు. పాలేరు డివిజన్ కార్యదర్శి బండెల వెంకయ్య ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతు సీపీఐఎంఎల్ మూడు విప్లవ పార్టీలు కలిసి ఒకే పార్టీగా ఏర్పడుతున్నాయని ఈ సందర్భంగా 3న ఖమ్మంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. 4, 5 తేదీల్లో భక్తరామదాసు కళాక్షేత్రంలో మహసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను మోదీ ప్రభుత్వం వాటిని రద్దుచేస్తుందని విమర్శించారు. పదేళ్ల నుంచి మోదీ పరిపాలన అంతా నమ్మకద్రోహమేనని ఎన్నికల వాగ్దానాలను తుంగలో తొక్కిందని ఆరోపించారు. దేశానికి అన్నం పెట్టే అన్నదాతలపై బీజేపి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మలీదు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి మారుతి మల్లయ్య, నాయకులు కుర్ర వెంకన్న, పుల్లయ్య, బాలిన యాదగిరి, ఉపేందర్, రెంటాల యాదగిరి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు రక్షణ ఏదీ?

- రూ.కోట్లు విలువచేసే ప్రభుత్వ భూములు ధరణి రికార్డుల్లో కనిపించవు
- ప్రభుత్వ భూములకు పాస్‌బుక్‌లు, రైతుబంధు

పెనుబల్లి, ఫిబ్రవరి 25: ప్రభుత్వ భూమిని రక్షించాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వ భూమికి రికార్డులు లేకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులకు పాస్‌బుక్‌లు, రైతుబంధు చేరుతున్నాయని అడవిమల్లెల గ్రామరైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మండలంలోని అడవిమల్లెల(లంకాసాగర్)లో ప్రభుత్వ పాఠశాలకు విరాళంగా ఇచ్చిన భూమికి అడవిమల్లెల నుంచి కారాయిగూడెం వెళ్లే రహదారి, సూరయ్యబంజర్ వెళ్లే రహదారి, లంకాసాగర్ ప్రాజెక్టుకు వెళ్లే రహదారితోపాటు నాగార్జున్ సాగర్ కాల్వ నుంచి లంకాసాగర్ ప్రాజెక్టులోకి తీసిన లింక్‌చానెల్ భూములు కూడా రికార్డుల్లోకి ఎక్కలేదు. దీంతో ఆయా భూములను కొందరికి అధికారులు పాస్‌బుక్‌లు జారీ చేశారు. దీంతో వ్యవసాయశాఖ అధికారులు సైతం క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే రైతుబంధుకు సిఫార్సు చేయడంతో కొందరు రైతులు రైతుబంధు కూడా పొందుతున్నారు. ఇదే గ్రామంలో సాగుచేసుకుంటున్న భూములకు పాస్‌పుస్తకాలు లేక కొందరు రైతులు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.



ఎన్నెస్పీకాల్వ నుంచి లంకాసాగర్ ప్రాజెక్టుకు వెళ్లే కాల్వ

అడవిమల్లెల రెవెన్యూలో 50ఎకరాల భూమిని అధికారు లు మిగులు భూమిగా చూపుతున్నారు. లంచాలకు అలవా టుపడిన కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పాస్‌బుక్‌లను జారీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నా యి. గ్రామంలో 1978లో పాఠశాల నిర్మాణం జరిగే సమ యంలో పుల్లఖండం పురుషోత్తం మూడెకరాల భూమిని దానం చేశారు. ఆభూమి రికార్డుల్లో మాత్రం పాఠశాల భూ మిగా కొంతకాలం నమోదు చేసినప్పటికీ ధరణిలో మాత్రం పాఠశాల భూమి కన్పించటం లేదు. సర్వేనెంబర్ ఒకటిలో 0.20 కుంటలు, 72సర్వేనెంబర్‌లో 2.20 భూమి ఉన్నట్లు 2016 వరకు రికార్డుల్లో నమోదైంది. కానీ ఆ తర్వాత ఇప్పటి వరకు రికార్డుల్లో పాఠశాలకు భూమి ఉన్నట్లుగా లేదు. దీంతోపాటు నాగార్జున్‌సాగర్ ప్రాజెక్టు నుంచి లంకాసాగర్ ప్రాజెక్టు వరకు లింక్‌చానెల్ ఏర్పాటుకు 1988లో భూసేకరణ జరిగింది. సర్వేనెంబర్ ఒకటిలో 2.09ఎకరాలు, కోంద్రుపాడు సర్వేనెంబర్ 70లో 2.20ఎకరాలు మొత్తం సుమారు రూ.5.20ఎకరాల్లో లింక్‌చానెల్‌ను ఏర్పాటుచేశారు. ఇందుకోసం 1988, 2007లోనే నష్టపరిహారం చెల్లించి రైతుల నుంచి భూమిని సేకరించారు. కానీ రికార్డుల్లో మాత్రం అవార్డు పొందిన రైతుల పేర్లను తొలగించలేదు. దీంతో వారికి కూడా రైతుబంధు చెల్లిస్తున్నారు. వీటితోపాటు అడవిమల్లెల నుంచి సూరయ్యబంజర్ వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు సుమారు కిలోమీటరన్నర, అడవిమల్లెల నుంచి సూరయ్యబంజర్ వెళ్లే బీటీ రోడ్డు, అడవిమల్లెల నుంచి లంకాసాగర్ ప్రాజెక్టుకు వెళ్లే మట్టి రోడ్డు వీటికి సంబంధించి రికార్డుల్లో మాత్రం ఎక్కడా నమోదు కాలేదు. జిల్లా అధికారులు అడవిమల్లెల భూములకు సంబంధించి సర్వే నిర్వహించి విచారణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



రికార్డుల్లో నమోదు కాని ప్రభుత్వ పాఠశాల

ఈ విషయమైన తహసీల్దార్ గంటా ప్రతాప్‌ను వివరణ కోరగా అడవిమల్లెల రెవెన్యూలో ప్రభుత్వ భూములు రికార్డుల్లో నమోదు కాలేదని తమ దృష్టికి వచ్చిందని పరిశీలించి రికార్డుల్లో నమోదు చేస్తామని తెలిపారు.

రోడ్డెక్కితే భయం.. భయం..

- భారీ వాహనాలతో వాహనదారుల భయం
- రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 25: వరుస రోడ్డు ప్రమాదాలతో వాహనదారులు హడలెత్తిపోతున్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో పెరిగిపోతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో భారీ వాహనాలు లెక్కకు మించి నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో తెలంగాణ నుంచి ఆంధ్రాకు వెళ్లే రహదారి మరమ్మతులకు గురికావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆరోపిస్తున్నారు. వాహనాల వేగం చూసి గుండెలు అరచేతిలో పెట్టుకుని వాహనాలను నడపాస వస్తుంది. గుంతలమయమైన రహదారుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు అంటున్నారు. సంబంధిత అధికారులు రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చేలా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

మితిమీరిన వేగంతో...

గ్రానైట్ లోడుతో ఆంధ్రాకు వెళ్లే లారీతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పెనుబల్లి మండలం లంకపల్లి మీదుగా కొన్ని, సత్తుపల్లి మీదుగా మరికొన్ని నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. జాతీయ రహదారిపై భారీ వాహనాలు వచ్చేటప్పుడు ఎదురుగా వచ్చే వాహనాలు గమనించకుండా వాహనాలను అధిగమించేందుకు వేగంతో వెళ్లి ప్రమాదాలు జరిగేందుకు కారకులవుతున్నారని వాహనదారులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ప్రమాదాలు నివారించేందుకు పోలీసుల యంత్రాంగం రాత్రివేళ పెట్రోలింగ్ వెహికల్స్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామీణ ప్రాంతాలలో మితిమీరిన వేగంతో..

ఆంధ్రా ప్రాంతం నుంచి వేంసూరు, సత్తుపల్లి మండలాలకు కంకర లోడుతో టిప్పర్లు వస్తున్నాయి. ఈ క్రమంలో అవి రోడ్డెక్కాయంటే గ్రామీణ ప్రాంత ప్రజలు భయం గుప్పిట్లో ఉంటున్నారు. ఆంధ్రా నుంచి సత్తుపల్లి మండలంతో పాటు దమ్మపేట మండలానికి ఈ కంకర లోడుతో వెళ్లే లారీ వేగంతో దుమ్మూధూళీ లేచి ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడిందని, నిత్యం రాకపోకలతో శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నామని, పిల్లలు, వృద్ధులు రోడ్డెక్కే పరిస్థితి లేదని వాపోతున్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించి ప్రమాదాలకు గురవకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.





మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న లారీలు

పునాదిస్థాయిలోనే నిలిచిన భవన నిర్మాణాలు

- కోర్టు వివాదమే ప్రధాన కారణం
- దృష్టిసారించని ప్రభుత్వం



పునాది స్థాయిలో నిలిచిన కల్లూరు ఏసీపీ కార్యాలయ భవనం

కల్లూరు, ఫిబ్రవరి 25: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన కల్లూరులో ఆరు సంవత్సరాల క్రితం రూ.లక్షల ప్రజాధనంతో నిర్మించిన పలు ప్రభుత్వ కార్యాలయ భవనాలు కోర్టు వివాదాల కారణంగా పునాదిస్థాయిలో నిలిచినాయి. ఇలా ఏళ్ల తరబడిగా ఈ సమస్య కోర్టులోనే నలుగుతున్న పైస్థాయిలో ప్రభుత్వ అధికారులు, పాలకులు సరియైన దృష్టి సారించకపోవడంతో ఈ భవనాల నిర్మాణం పనులు ముందుకు సాగక పునాది స్థాయిలోనే నిలిచి పోయాయి. 2016లో (నాడు) నేటి మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు, పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న (ఇప్పటి) రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయా భవనాలకు శంకుస్థాపనలు చేశారు. అయితే ఈ భవనాల నిర్మాణాలకు స్థానిక ఎన్నెస్పీ క్రాస్ రోడ్డు వద్ద గల సర్వే నెం 5.2 ప్రకారం గల ప్రభుత్వ భూమిలో తగిన విధంగా స్థలాలను సేకరించారు.

ఈ భవనాలకు మంజూరైన నిధుల వివరాలిలా ఉన్నాయి. కల్లూరు డివిజన్ ఏసీపీ కార్యాలయ భవనానికి రూ.80 లక్షలు, ఏఎంసీ పరిధిలో 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలకు గోదాముల భవనవాలు, రూ.2 కోట్లు. నిధులు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం భవనానికి రూ.70 లక్షలు మంజూరైయ్యాయి. అప్పటిలో ఆయా భవనాల పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ వాటి నిర్మాణ పనులు చేపట్టగా స్థానికంగా ఖాన్‌ఖాన్‌పేటకు చెందిన కొంతమంది వ్యక్తులు సదరు భూమిలో తమకు ప్రభుత్వం పరంగా భూ పంపిణీ చేస్తూ అనుభవదారుల పట్టాలు ఇచ్చారని అంటూ వారు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు స్టేతో సదరు భవనాల నిర్మాణాల పనులు నిలిచి పోయాయి. కాని ఆ భవనాల స్థలాలపై కోర్టులో కేసు వేసిన విషయంలో రెవెన్యూ శాఖ పరంగా నేటి వరకు అధికారులు తగిన చొరవ చూపి ఉంటే ఈ సమస్య ఇప్పటికి కొలిక్కి వచ్చి ఉండేది.

భవనాల నిర్మాణాలకు మోక్షం ఎన్నడో..

కల్లూరులో గత ఆరు సంత్సరాల క్రితం చేపట్టిన పలు భవనాల నిర్మాణం నిలిచి పోవటంతో ఈ భవనాల్లో కొనసాగాల్సిన కార్యాలయాలకు మోక్షం కలగని పరిస్థితి. కల్లూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంలో ఉండాల్సిన ఏసీపీ కార్యాలయం శాశ్వత భవనం లేక సత్తుపల్లిలో కొనసాగుతుంది. దీంతో పాటుగా ప్రభుత్వ స్థలాలు ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాల భవనాలు ఇంకాను ఏర్పాటు కాని పరిస్థితి. ఖమ్మం జిల్లా నుంచి భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర మంత్రులుగా ఉండటం. మరోవైపున రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిది కల్లూరు మండలమే. ఈ సమస్యను పరిష్కారానికి ఇప్పుడైన మార్గం దొరుకుతుందని పలువురు భావిస్తున్నారు.



అసంపూర్తిగా నిలిచిన గోదాం